నమ్మలేని నిజాలు

మత్తు వ్యాపారం
బ్రేకులు లేని రథం
చిత్త చైతన్యం.
బోనం వైభోగం
అమ్మవారి జాతర
నగర శోభ.
బాల భరోసా
మాటల దిల్ఖులాస
చేతలు శూన్యం.
అందని ఊహ
రియాక్టర్ విస్ఫోటనం
శవాల దిబ్బ.
వర్ష ఋతువు
రైతు నేల ఆనందం
పంటల సిరి.



- రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


శ్రీనిజం

రాష్ట్రాల్లో మొదలైందా
నదులనీటి రణరంగం ?
ఆగమాగమవుతుందా
బనకచర్ల జలరంగం ?
రైతుల ప్రయోజనాలను
కాపాడే నాథుడేడి ?
అన్యాయం జరుగుతుంటె
జలదోపిడి ఆపుదేది ?
(బనక చర్ల - తిర్ల మర్ల)



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 31-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:262 పేజీలు:6 వెల: రూ.1/-

# రష్యాలో అత్యంత శక్తివంతమైన భూకంపం.. చరిత్రలో ఆరోసారి రికార్డు







మాస్కో, జులై 30: రష్యాలో పసిఫిక్ తీరంలో ఉన్న కామ్‌చట్కా ద్వీపంలో ఇవాళ అత్యంత శక్తివంతమైన భూకంపంసంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఆ భూకంప తీవ్రత 8.8గా నమోదు అయ్యింది. అయితే భూగర్భ శాస్త్రవేత్తలు ప్రకారం.. భూకంపాల చరిత్రలో ఇది ఆరవ అత్యంత శక్తివంతమైన భూకంపంగా రికార్డు అయ్యింది. భూగోళాన్ని కుదిపేసిన అతి తీవ్రమైన పది భూకంపాల్లో తాజా భూకంపం నిలుస్తుందని హవాయి వర్సిటీ ప్రొఫెసర్ హెలిన్ జానిస్‌జెవిస్కీ తెలిపారు.

ఇదే స్థాయిలో గతంలో 2010లో చిలీ దేశంలో, 1906లో ఈక్వెడార్‌లో భూకంపం నమోదు అయినట్లు చెప్పారు. చిలీ భూకంపం క్విరిహు పట్టణంలో సంభవించింది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం ఆ భూకంపం వల్ల సుమారు 523 మంది మరణించారు. మూడున్నర లక్షల ఇండ్లు నేలమట్టం అయ్యాయి. ఇక ఈక్వెడార్‌లో వచ్చిన భూకంపం వల్ల .. అత్యంత బలమైన సునామీ వచ్చింది. ఆ సునామీ వల్ల సుమారు 1500 మంది మరణించారు. శాన్ ఫ్రాన్సిస్కో వరకు ఆ సునామీ అలలు చేరుకున్నాయి.

గతంలో రష్యాలోని కామ్‌చటాక్లోనే అయిదో శక్తివంతమైన భూకంపం రికార్డు అయ్యింది. 1952లో ఆ భూకంపం వచ్చింది. భూకంప తీవ్రత 9గా తొలిసారి రికార్డు అయ్యింది. ఆ సమయంలో భారీ సునామీ వచ్చింది. అమెరికాలోని హవాయి తీరాన్ని అది తాకింది. దాని వల్ల దాదాపు లక్ష మిలియన్ డాలర్ల నష్టం జరిగింది.

కామ్‌చట్కా భూకంపం వల్ల జపాన్, అమెరికా తీరాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు.

రిక్టర్ స్కేలుపై దీని తీవ్రతను 8.7గా గుర్తించారు. ప్రపంచంలోనే ఈ స్థాయిలో భూకంపం రావడం 2011 తర్వాత మళ్లీ ఇదే తొలిసారి అని చెబుతున్నారు.

ఈ భూకంపం నేపథ్యంలో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ హెచ్చరికలు చేసిన కొద్దిసేపటికే రష్యా, జపాన్‌ను సునామీ తాకింది.

భూకంపం నేపథ్యంలోని కంచట్కా, పెట్రోపావ్లోవ్‌స్క్ నగరాల్లోని పలు భవనాలు కంపించాయని రష్యా మీడియా తెలిపింది. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీశారని పేర్కొంది.

విద్యుత్, సెల్‌ఫోన్ సేవల్లో అంతరాయాలు ఏర్పడ్డాయని చెప్పింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన సమాచారం తెలియరాలేదు.

రష్యాలోని కురిల్ దీవులు, జపాన్‌లోని ఉత్తర ద్వీపమైన హక్కైడో తీర ప్రాంతాలను సునామీ తాకింది. హోనోలులులో సునామీ హెచ్చరిక సైరన్లు మోగడంతో భయాందోళనకు గురైన స్థానికులు నివాస ప్రాంతాలను వీడుతున్నారు.

మరోవైపు రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీరప్రాంతాలను సునామీ తాకిన నేపథ్యంలో అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్ అప్రమత్తమైంది. అమెరికాలోని భారతీయులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

సునామీ ముప్పును శాన్‌ఫ్రాన్సిస్కోలని భారత కాన్సులేట్ జనరల్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందని భారత కాన్సులెట్ జనరల్ తెలిపింది.

కాలిఫోర్నియా, హవాయితో పాటు అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాల్లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని అమెరికాలోని భారత పౌరులకు భారత కాన్సులేట్ జనరల్ సూచించింది. ఎమర్జెన్సీ సిట్యుయేషన్స్‌కు సిద్ధంగా ఉండాలని.. మీ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌కు చార్జింగ్ ఉండేలా చూసుకోవాలని తెలిపింది. సాయం కోసం ఎమర్జెన్సీ నంబర్లను సంప్రదించాలని కోరింది.

## 'రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు'.. సింధూ జలాల ఒప్పందంపై విదేశాంగ మంత్రి



న్యూఢిల్లీ, జులై 30: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడి అనంతరం పాకిస్థాన్ తో సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేశామని, ఆ నిలిపివేత ఇంకా కొనసాగుతోందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకంచెప్పారు. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని ఆయన వ్యాఖ్యానించారు.

బుధవారం రాజ్యసభలో మాట్లాడిన జైశంకర్.. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడేవరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని తేల్చిచెప్పారు. సింధూ జలాల ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో అధికారంలో ఉన్న పాలకులు భారత రైతుల ప్రయోజనాల కంటే పాకిస్థాన్ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన విమర్శించారు. నెహ్రూ హయాంలోని తప్పిదాలను సరిదిద్దలేమని గతంలో 60 ఏళ్లు పాలించిన వారు చెబుతూ వచ్చారని ఎద్దేవా చేశారు.

అయితే మోదీ ప్రభుత్వం నెహ్రూ పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దవచ్చని నిరూపించిందని విదేశాంగ మంత్రి అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, సింధూ జలాల ఒప్పందంపై తీసుకున్న చర్యలు ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందానికి అవసరమైన మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'ను ఐక్యరాజ్యసమితి తొలిసారి తన నివేదికలో ప్రస్తావించిందని మంత్రి గుర్తుచేశారు.

## ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం!

జమ్ము కశ్మీర్, జులై 30: జమ్ము కశ్మీర్ లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. పూంచ్ ప్రాంతంలో బుధవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్మూ కాశ్మీర్ లోని పూంచ్ జిల్లా పరిధి కస్లియాన్ ప్రాంతంలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతోంది. సరిహద్దు దాటి భారత్ వైపు చొరబడేందుకు యత్నించిన ఉగ్రవాదుల బృందాన్ని బలగాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయని ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో నక్కివున్న ఉగ్రవాదుల కోసం సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది.

జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లా పరిధిలోని కస్లియాన్‌లో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.. పూంచ్ సెక్టార్‌లోని సాధారణ ప్రాంతంలోని కంచె దగ్గర ఇద్దరు అనుమానితుల కదలికను సైనికులు చూశారు. ఇంతలోనే కాల్పులు జరిగాయి. ఉగ్రవాదుల కోసం సైనిక ఆపరేషన్ జరుగుతోంది. సరిహద్దు దాటి భారత భూభాగంలోకి చొరబడటానికి ప్రయత్నిస్తున్న ఉగ్రవాదుల బృందాన్ని ఆర్మీ దళాలు అడ్డుకున్నప్పుడు ఎన్‌కౌంటర్ జరిగిందని ఆర్మీ అధికారులు తెలిపారు.

ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడికి సూత్రధారి అయిన సులేమాన్ అలియాస్ హాషీం మూసాను భద్రతా దళాలు ఆపరేషన్ మహాదేవ్ పేరుతో అంతమొందించారు. అతను పాకిస్తాన్ సైన్యంలో పనిచేశాడు. శ్రీనగర్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతను హతమైనట్లు భద్రతా వర్గాలు నిర్ధారించాయి. ఆపరేషన్ మహాదేవ్‌లో ఆర్మీ, అఖీఖఈ, జమ్మూ, కాశ్మీర్ పోలీసుల భద్రతా దళాలు ఈ ఉమ్మడి ఆపరేషన్‌లో భాగంగా ఉన్నాయి.

## ప్రపంచాన్ని వణికించిన అత్యంత శక్తివంతమైన భూకంపాలు ఇవే..

రష్యా జులై 30: రష్యా ను భారీ భూకంపం వణికించిన విషయం తెలిసిందే. రష్యా తీరంలోని కంచట్కా ద్వీపకల్పంలోని పెట్రోపావ్లోవ్‌స్క్ తూర్పు దిశగా 136 కిలోమీటర్ల దూరంలో అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రతను 8.7గా గుర్తించారు. ప్రపంచంలోనే ఈ స్థాయిలో భూకంపం రావడం 2011 తర్వాత మళ్లీ ఇదే తొలిసారి. ఈ భూకంపం తీవ్రతతో రష్యాతోపాటు జపాన్, అమెరికా తీర ప్రాంతాలను సునామీ తాకింది . దాదాపు 30 దేశాలపై ఈ సునామీ ఎఫెక్ట్ పడింది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ ప్రపంచాన్ని వణికించిన 10 అత్యంత శక్తివంతమైన భూకంపాల (గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

దక్షిణ అమెరికా దేశమైన చిలీని 1960లో అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించింది. బియోబియో ప్రాంతంలో 9.5 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం ధాటికి చిలీ అతలాకుతలమైంది. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ భూకంపాన్ని వాల్డివియా భూకంపం లేదా గ్రేట్ చిలీ భూకంపం అని పిలుస్తారు. ఇప్పటి వరకూ ప్రపంచ వ్యాప్తంగా నమోదైన భూకంపాల్లో ఇదే అత్యంత శక్తివంతమైనది. ఈ భూకంపం ధాటికి 1,655 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు రెండు మిలియన్ల మందికిపైగా నిరాశ్రయులయ్యారు.

1964లో అమెరికా రాష్ట్రమైన అలస్కాను భారీ భూకంపం కుదిపేసింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 9.2గా నమోదైంది. ఈ భూ ప్రకంపనల ధాటికి సునామీ అలలు అలస్కా నగరాన్ని ముంచెత్తాయి. ఈ విపత్తులో 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2.3 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ఈ భూకంపాన్ని గ్రేట్ అలస్కా లేదా గుడ్‌ఫ్రైడే భూకంపంగా పిలుస్తారు.

2004లో ఇండొనేషియాలోని సుమత్రా దీవుల్లో భూకంపం సంభవించింది. 9.1 తీవ్రతతో సంభవించిన ఈ ప్రకంపనలకు సుమత్రా-అండమాన్ దీవుల్లో సునామీ వచ్చింది. ఈ విపత్తులో దక్షిణాసియా, తూర్పు ఆఫ్రికా అంతటా 2,80,000 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది నిరాశ్రయులయ్యారు.

2011లో జపాన్‌ను భారీ భూకంపం తాకింది. తోహోకు ప్రాంతంలో 9.1 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం ధాటికి వచ్చిన సునామీ 15 వేల మందిని బలి తీసుకుంది. దాదాపు రెండు లక్షల మంది నిరాశ్రయులను చేసింది. ఈ భూకంపాన్ని గ్రేట్ తోహోకు భూకంపంగా పిలుస్తారు.

1952లో ప్రపంచంలోనే తొలిసారి రష్యాలోని కమ్చట్కా క్రై ప్రాంతంలో 9 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం ధాటికి హవాయిలో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. దీంతో భారీ సునామీ వచ్చింది. ఈ విపత్తులో భారీగా ఆస్తినష్టం సంభవించింది.

చిలీలో 8.8 తీవ్రతతో భూకంపం..

చిలీలోని బియోబియో ప్రాంతాన్ని మరోసారి భూకంపం వణికించింది. 2010లో 8.8 తీవ్రతతో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. క్విరిహ్యూ నగరం సమీపంలో చోటుచేసుకున్న ప్రకంపనలకు 523 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 3,70,000 ఇళ్లు ధ్వంసమయ్యాయి.

ఈక్వెడార్-కొలంబియా భూకంపంతో 1500 మంది బలి

1906లో ఈక్వెడార్‌ను 8.8 తీవ్రతతో సంభవించిన భూకంపం వణికించింది. ఎస్మెరాల్డాస్ ప్రాంతంలో సంభవించిన ఈ ప్రకంపనలకు సునామీ విధ్వంసం సృష్టించింది. ఈ విపత్తులో 1,500 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ భూకంపాన్ని ఈక్వెడార్-కొలంబియా భూకంపం అని పిలుస్తారు.

అమెరికాలోని అలస్కాలో గల ర్యాట్ దీవులకు సమీపంలో 1965లో 8.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం ధాటికి 35 అడుగుల ఎత్తైన సునామీ అలలు ఎగసిపడ్డాయి.

1950లో అరుణాచల్ ప్రదేశ్‌లో 8.6 తీవ్రతతో భూమి కంపించింది. ఈ ప్రకంపనలకు భారీ భవంతులు ఊగిపోయాయి. ఈ విపత్తులో 780 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ భూకంపాన్ని 'అస్సాం-టిబెట్' భూకంపంగా పిలుస్తారు.

ఇండోనేషియాలోని ఉత్తర సమత్రా తీరంలో 2012లో భారీ భూకంపం సంభవించింది. 8.6 తీవత్రతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. భూకంపం తీవ్రత ఎక్కువే అయినప్పటికీ ప్రాణనష్టం మాత్రం తక్కువే

## కృష్ణమ్మకు భారీ వరద

**ఇన్, ఔట్ ఫ్లో 73 వేల క్యూసెక్కులు**
**గరిష్ట నీటిమట్టానికి ప్రకాశం బ్యారేజీ**
**70 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
**అప్రమత్తమైన అధికారులు**
**నదీ పరివాహక ప్రాంతాలలో రెడ్ ఎలర్ట్**

అమరావతి, జులై 30: కృష్ణానది ఎగువ ప్రాంతాల నుండి భారీ ఎత్తున వరద నీరు దిగువకు విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజ్ కి పెద్ద ఎత్తున వరద నీరు పోటెత్తుతోంది. పులిచింతల ప్రాజెక్టు నుండి మంగళవారం సాయంత్రం దిగువకు మూడు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో బుధవారం ఉదయానికి వరద నీరంతా ప్రకాశం బ్యారేజీకి చేరుకోవడంతో ప్రస్తుతం బ్యారేజీ వద్ద గరిష్ట నీటిమట్టం నమోదైంది.

ప్రకాశం బ్యారేజికి ఇన్, ఔట్ ఫ్లో 70వేల క్యూసెక్కులు ఉండగా, బ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలకు చేరుకోవడంతో మిగులు జలాలను బ్యారేజీ 70గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో 72 709 క్యూసెక్కులు ఉండగా, కృష్ణ తూర్పు మెయిన్ కెనాల్ కు 10,207 క్యూసెక్కులు, కృష్ణ పశ్చిమ మెయిన్ కెనాల్ కు 5527 క్యూసెక్కులు, గుంటూరు కెనాల్ కు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేయడంతో మొత్తం కెనాల్ కు 15,834 క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజి గరిష్ట నీటిమట్టం 12 అడుగులకు చేరుకోవడంతో మొత్తం బ్యారేజీ 70 గేట్లకుగాను 15గేట్లు రెండు అడుగుల మేర, మిగిలిన 55 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 60,875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజ్ కి భారీ ఎత్తున వరద నీరు చేరుకోవడం, సముద్రంలోకి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో అప్రమత్తమమైన అధికారులు ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. కృష్ణానది దిగువన ఉన్న పరివాహక ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు.

## రిమ్స్ మెడికల్ కళాశాలలో హాస్టల్ గదిలో ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

ఆదిలాబాద్ జూలై 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న రాజస్థాన్‌కు చెందిన సాహిల్ చౌదరి (19) అనే విద్యార్థి హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గదిలో ఒక్కడే ఉన్న సాహిల్ చౌదరి తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. రూములో ఉండే మిగతా స్నేహితులు వచ్చి సాహిల్‌ను పిలిచినా పలకకపోవడంతో తలుపు తీసే ప్రయత్నం చేశారు. తెర్చుకోకపోవడంతో తలుపులు పగలగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే తోటి విద్యార్థులు ఆయనను రిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పోలీసులు హాస్టల్ కు చేరుకొని వివరాలు సేకరించారు. రిమ్స్ అధ్యాపకులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి ఆత్మహత్యగల కారణాలు తెలుసు కుంటామని రిమ్స్ డైరెక్టర్ తెలిపారు. పోలీసులు విద్యార్థి సెల్ ఫోన్ ను పరిశీలిస్తున్నారు.

## భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదుతో పాటు, రూ.2వేల జరిమానా

జగిత్యాల, జులై 30మద్యానికి బానిసైన చంద్రయ్య ఓ రోజు మద్యం సేవించిభార్యను హత్య చేసిన ఓ భర్తకు యావజ్జీవ కారాగారా శిక్ష విధిస్తూ జగిత్యాల సెకండ్ అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నారాయణ బుధవారం తీర్పునిచ్చారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని యెకిన్ పూర్ కి చెందిన ఎర్ర చంద్రయ్య అతడి భార్య గంగరాజు కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవారు. భార్య గంగరాజు, అతడి కొడుకును వేధిస్తూ ఉండేవాడు.

29అక్టోబర్ 2022న చంద్రయ్య మద్యం మత్తులో ఇంటి వద్ద ఉన్న గంగరాజుతో ఘర్షణ పడి ఆమెను హత్య చేసి ఆమె ఒంటి పై ఉన్న బంగారాన్ని తీసుకొని ఆమెను ఒక మూటలో కట్టి యెకిన్ పూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ లో పడేశాడు. మృతురాలి కుమారుడు సుధీర్ ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు హత్య చేసిన నిందితుడుడైన చంద్రయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కాగా సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి అదనపు సెషన్స్ జడ్జి సుగాలి నారాయణ నిందితుడైన ఎర్ర చంద్రయ్య పై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు, రూ. 2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

### చురక

ఆందోళన చేయకుండా
అడుగకుండా ఏ జనత
మాటలన్నీ చేతలుగా
మార్చబోదు ఏ ప్రభుత
ఎన్నెన్నో హామీలను
ఎప్పుడైనా ఇచ్చేస్తరు
ఆర్థికంగా సంక్షోభం
అప్పులంటు దాటేస్తరు



-వేల్పుల నారాయణ
9440433475

### నేటి కందం- నేటికి అందం

విత్తనములు గల బంతులు
గుత్తముగా చెట్లు పెంచు కొరకై విసరన్
మొత్తముగ తెలంగాణము
క్రొత్తగ కదలినది నేడు కూరిమి మీరన్ !!

(తెలంగాణలోని ఘట్ కేసర్ లో విత్తన బంతుల ప్రయోగం సఫలం పర్యావరణానికి బలం)



-రాధశ్రీ
సెల్:9494481210

ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో
మహాకవి సినారె కళాపీఠం, హైదరాబాద్ నిర్వహణలో
పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత
మహాకవి డా॥ సి.నారాయణ రెడ్డి గారి
94వ జయంతి సందర్భంగా



సినారె సాహిత్య పురస్కారాల ప్రదానం

సభాధ్యక్షులు : డా॥ నందిని సిధారెడ్డి గారు ప్రముఖకవి తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు
ముఖ్య అతిథి : శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారు శాసనసభ్యులు, ఇబ్రహీంపట్నం
గౌరవ అతిథి : డా.ఏనుగు నరసింహారెడ్డి గారు, ప్రముఖకవి అడిషనల్ కలెక్టర్, మహబూబ్‌నగర్
ఆత్మీయ అతిథి : శ్రీ బైస దేవదాసు గారు 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు
అతిథులు : శ్రీ దాసరి దయానంద్‌రెడ్డి గారు ప్రముఖ సంఘ సేవకులు, తుర్కయంజాల్
శ్రీ కాకుమాను సునీల్ గారు మాజీ కౌన్సిలర్, తెలంగాణ పిసిసి సభ్యులు
కార్యక్రమ సమన్వయం : శ్రీ డా.పోరెడ్డి రంగయ్య గారు అధ్యక్షులు, తేజ సాహిత్య సేవా సంస్థ

తేది: 03-08-2025 సమయం: ఉదయం 10.00 గం॥లకు
వేదిక: ఏ.బి.ఆర్. కన్వెక్షన్ ఏ/సి బాంక్వెట్ హాల్
భారత్ పెట్రోల్ పంప్ ప్రక్కన, తుర్కయంజాల్ (సాగర్ రోడ్), హైదరాబాద్

ఆహ్వానించువారు
శ్రీ మల్లికేడి రాములు, అధ్యక్షులు, మహాకవి సినారె కళాపీఠం
సెల్: 8897726645

ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో
మహాకవి సినారె కళాపీఠం, హైదరాబాద్ నిర్వహణలో
పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత
మహాకవి డా॥ సి.నారాయణ రెడ్డి గారి
94వ జయంతి సందర్భంగా



జీవన సాఫల్య పురస్కార స్వీకర్త
డా.లింగంపల్లి రామచంద్ర గారు
సాహిత్య పురస్కార స్వీకర్తలు
డా.నాళేశ్వరం శంకరం గారు
డా.రాధశ్రీ గారు
డా.ఆచార్య ఫణీంద్ర గారు
శ్రీ కాసుల ప్రతాప్ రెడ్డి గారు
శ్రీ దోరవేటి చెన్నయ్య గారు
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు
శ్రీ జువ్వాడి దేవీప్రసాద్ గారు
డా.తత్త్వాతి ప్రమోద్ కుమార్ గారు
డా.మంథని శంకర్ గారు
డా.అగ్రహారం ఛందోజీరావు గారు
శ్రీమతి అరుణ నారదభట్ల గారు
శ్రీ పెద్దూరి వెంకటదాసు గారు
డా.పొన్నాల బాలయ్య గారు





# నేటినిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com




### ఘంటారావం

బతుకంతా
బడాయి
లేకుంటే
లడాయి.

చరవాణి సంభాషణ
శృతిమించనీయకు
అపార్థాల వ్యర్థాలు
పేరుతాయని మరువకు.

నిజాయితీపరులమని నిరంతరం
నినదించేవారిని నమ్మకు
నిన్ను నిండుగా నమ్మించి
నిలువునా ముంచేస్తారని మరువకు.

–గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



## బహుజన బావుటా...!

2011లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకై జరిగిన ఉద్యమానికి ఊపిరిపోస్తూ **"సకల జనుల సమ్మె"**ను **"వొల్లెడ"** దీర్ఘ కవితలో సమర్థంగా ఆవిష్కరించిన కవి వనపట్ల సుబ్బయ్య, 2014లో **"మశాల్"** తెలంగాణ మహోద్యమ కావ్యానికి జీవం పోశారు. **"కుర్చీ", "తడి", "తెలంగాణ తేనె పలుకు" "సెల్ఫ్ లాక్‌డౌన్"** వంటి కవితా సంపుటులను సాహితీ లోకానికి అందించి కవిగా అందరి హృదయాల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్న సుబ్బయ్య దీర్ఘ కవితలు రాయడంలోనూ దిట్ట.. తమ తొలి రచననే దీర్ఘ కవిత **"వొల్లెడ"** కావడం, ఆ దీర్ఘ కావ్యానికి ప్రతిష్ఠాత్మకమైన కరీంనగర్ జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య, సాహితీ గౌతమి సినారె కవితా పురస్కారం రావడం విశేషం.. సందర్భానుసారం బాధ్యత గల కవిగా సామాజిక చైతన్యం కోసం ఆయా ప్రముఖ పత్రికల్లో తమ కవితల్ని రాస్తూ.. పైన పేర్కొనబడిన కవితా సంపుటులను వెలువరించడమే గాక.. మరో నాలుగు దీర్ఘ కవితలను గ్రంథస్థం చేసి సాహితీ లోకానికి అందించారు. తెలంగాణ సిద్ధాంతకర్త గా వెలుగొందిన ప్రొఫెసర్ జయ శంకర్ గారిపట్ల తమ గౌరవాన్ని చాటు కుంటూ 2017లో **"జయశంకరుడు"** దీర్ఘ కావ్యాన్ని రాశారు. 2022లో మొహర్రం పీర్ల పండుగ కవితా వస్తువుగా **"అలాయి బలాయి"** మరో దీర్ఘ కావ్యాన్ని ప్రకటించారు. 2023లో "అంబేద్కర్"పై **"మా అక్షరం ఆయుధం"** అనే పేరుతో ఇంకొక దీర్ఘ కవితను వెలువరించారు. తమ 11వ గ్రంథంగా 2023లో మహాత్మా జ్యోతిబా పూలేపై "బహుజన బావుటా'' పేరుతో దీర్ఘ కవితను వెలువరించారు. తెలంగాణ పట్ల శ్రద్ధా భక్తులను అణువణువునా సంతం చేసుకున్న ఆయన రచనల్లో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయా లకు.. అస్తిత్వానికి పెద్దపీట వేస్తూనే.. ప్రగతిశీల ఆలోచనలతో.. అభ్యుదయ భావ పరంపరతో మానవీయ కోణం లో తమ రచనలకు జీవం పోయడం అభినందనీయం.. బహుజనులకు బాసటగా నిలిచిన మహాత్మా జ్యోతి రావు పూలేపై ఆధునిక వైతాళికునిగా మన ముందు నిలిపారు. మన దేశంలో అంటరానితనంపై, కుల వివక్షపై, స్త్రీ విద్యా ఆవశ్యకతపై గళమెత్తిన తొలి సంఘ సంస్కర్త పూలే గురించి విలువైన సమాచారంతో **"బహుజన బావుటా"**ను రూపుదిద్దారు. దీర్ఘ కవితను సంబంధించిన లక్షణాలను పాటిస్తూ 21 ఖండికలుగా మహాత్మా జ్యోతిరావు ఫూలేను (దీర్ఘ కవితలో) ఆవిష్కరించటం అభినందనీయం. ఈ గ్రంథం వెలుగులోకి రావడానికి తెలంగాణ సాహిత్య అకాడమీ అండగా నిలవడం స్వాగతించ దగింది.

పగటిపూట అలుముకున్న చీకటికి నిప్పంటించి కుల నిర్మూలనకై మండిన తొలి అడుగుగా పూలేను అభివర్ణిస్తూ రాసిన ఈ కావ్యంలో.. పూలేను బహుజన బావుటాగా మనముందు నిలిపారు. కుల సర్పాలు బతుకు సూర్యుడిని మింగిన పుడు ఓ వేగు చుక్క పూలే రూపంలో పొడిచిం




**ప్రతులకు:**
తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభవన్, రవీంద్రభారతి
హైదరాబాద్-500 002.
ఫోన్: 040-29703142

దని కొనియాడారు. వర్ణ ధర్మాలు పంచ భూతాల్ని బంధించినప్పుడు ఒక శ్వాస బుస కొట్టిందనీ ఆచారాలు సామాన్యుల గుండెల్లో వుండు చేసినప్పుడు "మహాబలి"గా పూలే ఉదయించాడని పేర్కొన్నారు. కింది కులాల విముక్తికై. కాలం సంకెళ్లను తెరిచి.. స్వేచ్ఛకు పురుడు పోసి.. మానవ హక్కుల్ని దోసిట్ల వొంపిన ఆధునిక సామాజిక విప్లవ పితామహుడుగా మహాత్మా జ్యోతిరావు పూలేను అభివర్ణించారు.

విస్మృతుల విముక్తికై సహచరికి చదువును బోధించి బడుగులే భారతావనికి ముందు చూపని శిరస్సెత్తిన చేతనా కేతనం గా పేర్కొనడమే గాక నదులకు నడకనేర్పి దిక్కులకు నిర్దేశం చూపి బ్రాహ్మణ బనియా మనువాదపు పునాదులను కూల్చిన గొప్ప శూద్రుడుగా పూలేను ఆవిష్కరిస్తూ ఈ దీర్ఘ కవితను కొనసాగించారు. అంటు ముట్టు మంటల్ని పురాణ అవతారాల్ని పౌరాణిక క్రూర రూపాల్ని దోపిడీవర్గ కుత్వారాల్ని అడుగడుగున పొట్టు పొట్టు పల్ల జీరి, సామాజిక వికాసానికై గళమెత్తిన మహాజన ధృవతారగా పేర్కొన్నారు. చాతుర్వర్ణాల. కుటిల వేదాలు కుట్రల పురాణాలు పూజా రుల దోపిడీ తనాల నిలదీసి మంత్ర స్తోత్రా ల మాయా తనాలను నిరసిం చిన మహనీ యుడుగా మానవతను బోధించి ప్రజాహక్కు లను ఎరుక చేసి సమన్యాయాన్ని నిలబెట్టిన మహాశయుడుగా ఫూలేను ప్రస్తుతించారు. దేశంలోనే అందరికన్నా ముందు అంటరాని బాలికలకు బడులు పెట్టి చదువుల జెండాను చేతికిచ్చి వితంతువుల పునర్వివాహా లకు ప్రాణమిచ్చి అన్నీ తానైనాడని కొనియాడారు.

ఇంకా ఈ దీర్ఘ కవితలో.. భ్రూణ హత్య లు శిశు హత్యలు, బాల్య వివాహాలు మద్య పాన నిషేధాలకై సామా జిక పోరు కెరటమై నినదించిన తొట్ట తొలి మహనీయుడు ఫూలే అని పేర్కొన్నారు.

జ్యోతిబాపూలే.. బ్రాహ్మణులకు శత్రువు కాదు బ్రాహ్మణిజానికీ శత్రు వనీ ఎంతో మంది బ్రాహ్మణ మిత్రులు ఆయనకున్నారనీ స్నేహితులు ప్రేమాస్ప దులు మానవీయతను ప్రేమించినారనీ, ఆయనది అభిమానించే స్వభావమనీ అంతేగాక శ్రమ విలువల్ని గౌరవించే వ్యక్తిత్వమని ఓ ఖండికలో కవి వనపట్ల వివరించారు.

సామాజిక న్యాయం భిక్ష కాదనీ మా హక్కులనీ నినదించిన జ్యోతిబా ఫూలే సాంఘిక గౌరవానికై నిత్య సమస్యలపై ఉద్యమించిన జన సామాన్య సంస్థ సత్యశోధక సంస్థ ద్వారా ఆయన అందించిన సేవలను ప్రస్తావించినతీరు ప్రశంసనీయంగా ఉంది.

బహిష్కృతులకు బతుకు దీపమై అందని అక్షరాన్ని నేలకు దింపిందనీ అలల మీద వడవై వేదాగ్నిలో సావిత్రయి..అట్టడుగు ఆత్మగౌరవాన్ని సావిత్రీబాయి ఆకాశంపై నిలిపిందని కొనియాడారు.

**సావిత్రీబాయి బడులు**
**మట్టిపూల వెలుగులు**
**దళిత మహిళలకు**
**అనాథలకు అమ్మ బడులు**
**వితంతువులకు చిరునవ్వులై**
**స్త్రీ విముక్తికి స్త్రీ సాధికారితకై ఆమె తొలి అడుగు వేసిందని** కొనియాడారు.

**చదువులే**
**బువ్వ పెడ్తవి**
**బతుకులను నిలబెడ్తవి**
**రండీ బహుజనులారా**
**చదువుకోండి** అంటూ పిలుపు నిచ్చిన జ్యోతిరావు పూలే గురించి గుర్తు చేసుకుంటూ కవి వనపట్ల రాసిన పంక్తులు ఇప్పటికీ, ఎప్పటికీ బహుజన సమూహాల్లో చైతన్యాన్ని రగిలిస్తూనే ఉంటాయి.

**అంధకారానికి**
**అక్షరమే ఆయుధమని**
**అడుగడుగునా చదువుల పంచి**
**దేహాన్ని చెలిమె చేసి**
**అట్టడుగు జనుల**
**దూపతీర్చిన మహోన్నత మూర్తి**
అంటూ పూలే పట్ల కవి వనపట్ల తమ గౌరవాన్ని చాటారు.

అనాథల అమ్మగా, బడుగుల జననిగా భాసిల్లిన సావిత్రమ్మను, ఆధునిక యుగ వైతాళికుడుగా జ్యోతిరావు పూలేను దీర్ఘ కవితలో గొప్పగా ఆవిష్కరించిన కవి వనపట్ల సుబ్బయ్య అభినందనీయులు.

దీర్ఘ కవితకు ఉండాల్సిన కనీస ప్రమాణాలను సంపూర్ణంగా పాటిస్తూ కవి సుబ్బయ్యగారు ప్రకటించిన భావాలు జ్యోతిరావుఫూలే దంపతులకు అక్షర సుమాలుగా కొలువుదీరాయి. బహుజనుల చైతన్యాన్ని ప్రేరణగా నిలిచేలా ఈ గ్రంథం రూపుదిద్దబడింది.



– దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

## కూతురైనా.. కొడుకైనా!

సృష్టిలో తేడాలెన్నో..
ఒకదానికి రెక్కలు, ఇంకోదానికి రెప్పలు
ఒకరికి గంభీర స్వరం
మరొకరికి మృదుల గాత్రం
కానీ.. ప్రేమ పంపకాల్లో
తేడాలు ఉండవు నాన్నకు.

ఎన్ని తీరాలున్నా
సముద్రం ఒక్కటే అయినట్లు
నాన్న హృదయంలో
పిల్లలందిరిపై ఒకే తీరు ప్రేమ.
కూతురైనా.. కొడుకైనా
తన ప్రేమ తరాజులో సమతూకమే
తలెత్తుకునే విజయం ఎవరు సాధించినా
సంతోషిస్తాడు నాన్న.
తలవంపులు ఎవరు తెచ్చినా
తన కన్నీటిలో తేడా చూపించడు.
అక్షరాలకు రూపమున్నట్లు
ఆయన భావాలకు ఉండదు.
ఎవరిపట్లనైనా..
ప్రేమ వెలుగు పంచడంలో
చంద్రుడిలా ఉంటాడు నాన్న.

చేతికి వేళ్లు ఐదు భిన్నాలు
కానీ ఆ వేళ్ళన్నీ కలిస్తేనే చరిత్ర
ఎలాంటి తేడాలున్నా
పని చేసే చేతి సారథ్యంలో
అన్ని వేళ్ళ తోడ్పాటు అనివార్యం.
స్వభావాలు వేర్వేరైనా
పిల్లలందరూ తన ఆత్మ తునకలే.
నాన్న కళ్లలో ఎప్పుడూ
ఒకే ప్రేమ గీతం
ఆ గుండె పల్లవించేది
అరమరికలు లేని ఆత్మ గీతం!



– ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## గజల్..

జాలి లేని కాలమిపుడు సాగుతోంది నిర్దయగా..
అందరిలో స్వార్థాన్నే నింపుతోంది నిర్దయగా..

అధికారపు దాహంతో యుద్ధాలను చేస్తున్నది
అమాయకుల ప్రాణాలను నలుపుతోంది నిర్దయగా..

నిదురించే చీకటిలో నిశాచరులు చెలరేగును
మనుషులతో వ్యాపారం జరుపుతోంది నిర్దయగా..

బంధాలకు విలువలేదు ప్రాణులపై కరుణ లేదు
మనసులలో కాఠిన్యం పెంచుతోంది నిర్దయగా..

పసివారిని భక్షించే రాక్షసులకు శిక్షలేదు
ఉదాసీన వైఖరినే చూపుతోంది నిర్దయగా...

ధనవంతుల రాజ్యంలో సామాన్యుల మనుగడేది?
అంతరాలు సృష్టిస్తూ కదులుతోంది నిర్దయగా..

స్థితిగతులను మార్చేందుకు ప్రతినబూను ఓ స్వప్నా!
సౌఖ్యాలను హరియిస్తూ మిగులుతోంది నిర్దయగా..



–స్వప్నకృష్ణ
9440536669

## హృదయాన్ని ద్రవింపజేసే కథలు "మూడు పాయలు"

పర్కపెల్లి యాదగిరి వంగర నరసింహారెడ్డి కొండి మల్లారెడ్డి లు రాసిన మూడుపాయలు లోని కథలు హృదయాన్ని ద్రవింపజేసి గాఢతను నింపుతాయి. కథల సంభాషణ ఎంచుకున్న వస్తువు దృశ్యాల చిత్రీకరణ మన కండ్ల ముందే జరుగుతున్న పాత్రల సంభాషణ పల్లె జీవన సహజ శైలి వర్ణన తెలంగాణ సంస్కృతిలో భాష వ్యవహారం ఆగమైపోతున్న పల్లె జీవితాలు పెనవేసుకొని ముడిపడే బంధాలు ఈ పుస్తకంలోని 12 కథల్లో ఉన్నాయి .ఈ కథలలో వేటికవే ఆలోచింపచేస్తాయి .ప్రతి కథ చదువుతున్నప్పుడు మన మనసులు బరువెక్కుతాయి

యాదవ్వ కన్నీళ్లు సగటు పల్లె బతుకులోని తాగుబోతు భర్తలు ఎంత దుఃఖాన్ని ఆడదానికి మిగులుస్తున్నారో తెలియజేస్తున్నది .ఈ కథలో పల్లెలో రాజ్యమేలుతున్న మద్యం రక్కసి ఎన్ని కుటుంబాలను కబళిస్తున్నదో తెలియ చేస్తున్నది. మత్తులో తూగే తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేసే నాగరాజులు ఎందరో మనకు ఈరోజు పల్లెల్లో కనివిస్తున్నారు .మంచి సందేశాత్మక కథ బల్లి పాతర.

పల్లెల్లో మనుషుల బంధాలు సంబంధాలే కాదు పశువులు పక్షులు తమ బంధువులే ఇంట్లోనే సభ్యులే ఆ మమతలు ప్రేమలు ఇంటికి రాని కొమ్ముల బర్రె ఎంత మందిని ఆగం చేస్తదో తెలంగాణ సంస్కృతిలోని రైతు జీవనంలో పశువులు పక్షులు, కుటుంబ సభ్యులే బంధాలు ప్రేమల విలువ తెలిపే కొమ్ముల బర్రె కథ చదివితే నిజమైన రైతు ప్రేమ తెలుస్తుంది.

జరిగిన కథల అంశాన్ని మరిచిన తీరు మనకు ఉంగరం కథలో కనిపిస్తుంది. ఎప్పుడూ ఎలా బాధ్యతగా మసలాలో ఈ కథ మనకు వివరిస్తుంది. కథ కాస్త పెద్దదైన ఆలోచింపజేసేదే రాజమణి కథలో రచయిత పర్క పెల్లి యాదగిరి పల్లెలోని స్త్రీ ఔన్నత్యాన్ని ధైర్యాన్ని చూపించే ప్రయత్నం చేశారు .

"మన పాణాలు ఈడనే పోవాలా ఈ గడ్డకే మన బొందలు మొరిగిపోవాలి" అని రాజమణి అనే మాటలు సమస్యలను ఎదుర్కొని నిలబడే ధైర్యతత్వాన్ని అందరికీ నేర్పిస్తుంది. ఈ కథ పల్లెల్లోని కుటుంబాల్లో జరిగే యదార్థంగా ఈ కథ నిలుస్తుంది . మార్గం తప్పకుండా ఉంటుందని ప్రతి ఒక్కరికి రచయిత ధైర్యంగా నిలుస్తాడు ఇక్కడ ఈ కథలలో పల్లె సంస్కృతి భాష వ్యవహారాలు రైతు జీవన యాతన దుర్భర పరిస్థితులు ప్రేమలు ఆప్యాయతలు కలివిడితనం భరోసా వాక్యాలు ఎన్నో ఉన్నాయి. దిగులు అనే కథలో కరోనా కాలంలోని కష్టాలు సంభాషణలు మనసును ఓదార్చుతాయి.

పందిరి కథలో ప్రారంభం ఎత్తుగడ కథలు ఎలా ఉ




**ప్రతులకు:**
ప్రర్క పెల్లి యాదగిరి
వంగర నరసింహారెడ్డి
కొండి మల్లారెడ్డి
9299909516

ఒదంటే "చిక్కని చీకటిని పలుచన చేస్తూ వేకువ కాంతులు నేల విూద పరుచుకుంటూ ఉన్నాయి. పక్షులు ఒళ్ళు విరుచుకుంటూ అరుస్తూ గొంతుల్ని శుతి చేసుకుంటూ ఉన్నాయి వాకిళ్ళని చీపుళ్ళు వయోలిన్ మోగిస్తుంటే అలుకు చినుకులు దరువేస్తూ ఉన్నాయి". ఈ అడ్డమైన తాగుడు చేయబట్టి ఎన్ని సంసారాలు ఆగమైపోతున్నాయో'' మంది సొమ్ముకు ఎగబడితే గోస తాకుతది .ఇలా పల్లెల్లోనే నీయ్యతిని చక్కగా చెప్పిండు రచయిత ."

"ఒక ఇల్లు కట్టినోడు కాదు ఒక లగ్గం చేసినాడు రెండు లక్షలు కుప్ప చేసిండు"'' తాగుడుకు ఆగమైనా పల్లెల్లోని ప్రతి మగాడి పరిస్థితి ఇలానే ఉంది. ఎందుకో ఎంత ఆలోచించినా దీనికి ఇప్పుడు జవాబు దొరుకుతనే లేదు.

మగాడి తాగుడు ఆడమనిషికి పుట్టెడు కష్టాలు

నేటి పరిస్థితికి అద్దం పడుతున్న కథ ఇది. అలసి బతుకు కష్టమైనా జీవితానికి రచయిత దారి చూపిస్తున్నాడు ఈ కథలో .రాజమణి పందిరి ఈ రెండు కథలలో బీద ఆడవారి కష్టాలు ఎన్నో వారి బతుకులలో నిండిన అమాసను దూరం చేసి వారి కన్నీళ్ళకు సమాధానం ధైర్యం ఇచ్చిన కథలు ఈ మూడు పాయలు సంపుటిలో ఉన్నాయి.

ప్రాజెక్టుల పేరు మీద భూమిని జీవితాన్ని సర్వస్వాన్ని కోల్పోయి చేసే ఉపాధి కరువై విలవిలలాడే భూనిర్వాసితుల దుఃఖం అంతా ఇంతా కాదు .

ఆ దుఃఖాన్ని తెలిపే కథ మట్టిదిబ్బ మొగులయ్య మట్టిదిబ్బల కింద ప్రాణిని విడిచిన సందర్భం నిర్వాసితుల దుఃఖం మనల్ని కన్నీరు పెట్టిస్తుంది

ప్రాజెక్టుల పేరుతోనో, సెజ ల పేరుతోనో అభివృద్ధి పేరుతోనో ఎంతో మంది జీవితాలు బలైపోతున్న సందర్భం మనకు మట్టిదిబ్బ కథలో కనిపిస్తుంది .

అన్యాయం ముందు సామాన్యుడి ఆర్తనాదం వినబడదా అని ప్రశ్నిస్తాడు రచయిత కొండి మల్లారెడ్డి ఈ మట్టి దిబ్బ కథలో. నిర్వాసితుల దుఃఖమే మరోకథ కుర్రాయి నాయకుల హామీలు సామాన్యుల జీవితాలు ప్రశ్నకు దొరకని సమాధానాలు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో గ్రామీణ పల్లె జీవనాన్ని దోచుకుంటున్నా ,యథార్థ గాథలే ఈ మూడు పాయలు పుస్తకంలో ఉన్నాయి .ప్రతి కథలో అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నారు రచయితలు .అది రాజమణి పాత్ర కావచ్చు మొగులయ్య పాత్ర

గావచ్చు బల్లిపాతర కథలో యాదవ్వ కావచ్చు ఇక కొమ్ముల బర్రె కథ పశువుల పక్షుల బంధాలను చెబుతుంది బర్రెపైగల మమకారం కుటుంబ సభ్యురాలిగా బర్రెపైగల ప్రేమ రైతు జీవితంలో కనిపిస్తుంది కథా రచయితలు ఈ ముగ్గురు కథా రచనలో ఆరితేరిన రచయితలు.

మూడు పాయలుగా ఈ పుస్తకానికి చేసిన నామకరణం కూడా ఆలోచన కలిగిస్తుంది ప్రతి కథలో తెలంగాణ భాష సందర్భానుసారం వివిధ పాత్రల సంభాషణలో రచయితలు ఎంతో ప్రతిభను చూపించారు.

వివిధ సందర్భ వర్ణనలో చాకచక్యాన్ని ప్రదర్శించారు. కథ చదువుతుంటే దృశ్యాలు మన కండ్ల ముందే నిలుచున్నట్టు ఆసక్తిని తమ భాషా ప్రయోగం ద్వారా కల్పించడంలో సఫలమయ్యారు. తెలంగాణ ప్రాంత జనం గోస దీనస్థితి బతుకు సమస్య జీవన పోరును ఈ కథలు సూచిస్తున్నాయి .ఈ "మూడు పాయలు" కథా సంపుటిలో పరకపెల్లి యాదగిరి వంగర నరసింహారెడ్డి కొండి మల్లారెడ్డి లు రాసిన

బల్లి పాతర కొమ్ముల బర్రె ఉంగరం రాజమణి ఎండమావులు దిగులు పందిరి మట్టిదిబ్బ నమకాలు ఐదు దోసిల్ల మన్ను కుర్రాయి కలలు

లాంటి మంచి పన్నెండు కథలు ఉన్నాయి .ఇవి వివిధ పత్రికలలో ప్రచురితమైన కథలను కథా సంపుటిగా తీసుకువచ్చారు.

ఈ కథలలో ఒక్కొక్క కథది ఒక్కొక్క విలక్షణమైన శైలి ఎంతో ఆకట్టుకుంటుంది .భాష ఎంతో నచ్చుతుంది. వివిధ సందర్భానుసారం కదిలించిన సన్నివేశాలు కంటతడిని పెట్టిస్తాయి .ఈ మధ్యకాలంలో వచ్చిన మంచి కథా సంపుటిగా ఈ "మూడు పాయలు"



– సిరిసిల్లా
గఫూర్ శిక్షక్
9849062038

## 'ఊరి చివరి మనిషి' పుస్తకావిష్కరణ




తెలంగాణ సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే), దియా పబ్లికేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన రచయిత్రి దియా విఘ్నేషఫ్ రచించిన **"ఊరి చివరి మనిషి"** పుస్తకావిష్కరణ సభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇది జే రాములు అనే దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ పోలీస్ ఆఫీసర్ ఆత్మకథ అని తెలిపారు. కులం కారణంగా పుట్టినప్పటి నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తన లక్ష్యం సాధించుకున్న వ్యక్తి రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని టీ రమేశ్, ప్రముఖ రచయిత డేవిడ్, గడ్డం సదానందం పాల్గొన్నారు.

## భారతదేశం గర్వించదగ్గ మహాకవి సినారె

–గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



అస్సామీ కవి నీలమ్ కుమార్‌ను సత్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ , ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు డా॥ జె.చెన్నయ్య తదితరులు

### –నీలమ్ కుమార్‌కు సినారె జాతీయ సాహిత్య పురస్కారం ప్రదానం

భారతదేశం గర్వించదగ్గ మహాకవి సి. నారాయణరెడ్డి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. సినారె సాహిత్యం తెలుగు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.

ఆయన రచించిన విశ్వంభర కేవలం పుస్తకం మాత్రమే కాకదని, అది ఒక ఫిలాసఫీ అని గవర్నర్ కొనియాడారు. మంగళవారం రవీంద్రభారతిలో సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్ఞాపపీఠ అవార్డు గ్రహిత సి. నారాయణరెడ్డి 94వ జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ అస్సామీ కవి నీలమ్‌కుమార్‌కు సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం, రూ.5 లక్షల నగదు బహుమతిని అందజేశారు. పురస్కార గ్రహిత నీలమ్ కుమార్‌ను గవర్నర్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ సాహితీవేత్తగా, రాజ్యసభ సభ్యుడిగా ఎంతో ఉన్నతిని చాటుకున్న మహోన్నత వ్యక్తి సినారె అని అభివర్ణించారు. పురస్కార గ్రహిత నీలమ్ కుమార్ మాట్లాడుతూ సినారే పేరిట పురస్కారం అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు.

ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డా॥జె.చెన్నయ్య, ఏపీ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ సి. ఆంజనేయరెడ్డి, ట్రస్ట్ అధ్యక్షురాలు గంగ. పత్తిపాక మోహన్, సినారె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సభకుముందు నాగార్జున సాగర్ పేరిట కూచిపూడి నృత్యరూపకాన్ని ప్రదర్శించారు.



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం-కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

### నగరం విస్తరిస్తుంది

ఒకప్పుడు నగరం చుట్టు.
మానవ జీవన జీవనోపాధి.
ఉత్పత్తుల జీవవైవిధ్య సమ్మేళన.
ప్రాకృతికసౌందర్యం.
మనసును పెనవేసుకుని.
స్వాగతాలుపలికే.
పరిమలపు పూల వనాలు
నోరూరించి గుటకలు వేయించే
తీపి రుచుల పండ్ల తోటలు.
పుష్టి పోషక పంట సిరుల
ధాన్యపురాశులను.
పైరు పొట్టలో నింపుకొని
గలగల స్వరాలతో రాగాలు.
పలికే ప్రకృతి హారాలు.
పల్లెలు పట్టణం తో
వియ్యమొంది.
పంట భూములను.
బీడు మైదానాలుగా మార్చి.
మింటిని తాకేంత బహుళ.
అంత న్తుల వేడలు
నిర్మించుకుంటున్నవి.
నగర వీధులన్నీ కాంక్రీట్.
పొరలు పొరలు పర్చుకుని.
వాన లెస్సగా కురిసిన.
నగరం దాహార్తిని తీర్చనంటుంది.
మెరిసే అద్దాల మేడలకు మురిసి.
మట్టిని ఈసడించుకునే.
నవ నాగరిక తనం.
మనిషి ననే సంగతే మర్చి
బాంధవ్యాలకు నీళ్లువొదిలి
కాసుల కోసం ఆశపడి
భుక్తికి మూలమైన అమ్మను
అమ్మకానికి పెట్టి.
ఆగమాగమైన కుటుంబాలు
పల్లెలు రూపం.
మార్చుకున్నాయి.
పట్నంతో చేతులు కలిపి.
ఓదార్చటానికి జీవవైవిద్యాలే.
కనుమరుగవ్వటానికి మనిషి
అత్యాషే.
సర్వం నాదేననే మనీ "షి"
తనం.
పచ్చదనాన్ని పర్యావరణాన్ని.
తుడిచేసిన నేలన చినుకు.
నుకు ఇనకనంటుంది.
ఇంటి కొక్క బోరు పొక్క వేసిన.
చుక్కనీరు రానంటుంది.
ఆశలు ప్రేరేపించుకున్న.
మనసులు తృప్తి
పడనంటున్నవి.
సంతోషాలు మచ్చుకైన.
కనిపించని నగర జీవితాలు
నటిస్తవి మానవ మూలాలు ఒక్కటైన.
ముచ్చటించుకునే బంధుఖునడుమ
పైస ఆశ జొరబడి.
అత్యాశ సెగలు రాజేసుకుని
మాట కరువై,బంధం బరువై,
ఆస్తిహక్కు వివాదాలలో.
బందూకులు, బరిసెలు
పెనుగులాడుతున్నవి.
బ్రతుకు విలువ తెలుసుకోక.

**-యరకల యాదయ్య,** 9866468979

### గాలి పని !!

గాలి విసురుగా వచ్చి
ద్వారం వద్ద నిలుచున్న
"కుడి తలుపుతో"ఎడమ తలుపు
మీద
ఎడమ తలుపుతో" కుడి తలుపు
మీద
చాడీలు చెపుతోంది!!
అందుకే రెండూ
విరిగేటట్లు కొట్టుకుంటున్నాయి
మనుషుల్లాగే?

**-కందాళై రాఘవాచార్య**
8790593638

### తెలంగాణ పెన్నిధి దాశరథి

నిజాం గద్దను గద్దె దించాలని
నగారా మ్రోగించావు
రజాకారు నక్కకు రాచరికంబు
దక్కునే అని గర్జించావు
అన్యాయాలపై అగ్ని దారులు
కురిపించావు
తెలంగాణ నాట వెలుగెత్తి
రుద్రవీణ తంత్రులు మీటావు
అక్రమాలపై ధ్వజమెత్తిన
నీ కలానికి అమృతాభిషేకం!
రాజును బూజు అన్న ధీశాలి
జైలు గోడలను బొగ్గుతో పద్యాలు
పలికించిన చైతన్యశీలి !
పద్యాన్ని ఆయుధంగా మలుచుకుని
నైజాం సర్కారుతో సమరం సల్పినావు
ఆ చల్లని సముద్ర గర్భం
దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశం లో
కానరాని బాస్కరులెందరో
గాయపడిన కవి గుండెలలో
రాయబడని కావ్యాలెన్నో అన్న
దాశరథి తెలంగాణ పెన్నిధి !
తెలంగాణ త్యాగాలను
అమరం చేసిన శతవసంతాల
తెలంగాణ వీణ
కోటి రతనాలవీణ!

**– పట్లోళ్ళ బక్కారెడ్డి**
9705315250

### సినారె – రాసినారె

ఇల్లు పల్లెతోడు ఇలవేల్పు ఇల్లాలు
చదువు అంటె మీకు చాలప్రీతి
హక్కుజన్మ ఊరు హనుమాజి పేటనే
కనుమ వినుము దారి కందుకూరి.

పాఠమెంతొరుచిగ పాటలూ అంతేను
సమయపాలనంటె సాటి మీరె
రాతలను సినారె రాసితి వెన్నెన్నొ
కనుమ వినుము దారి కందుకూరి
(జూలై29 సినారె జయంతిసందర్భంగా)

**-కందుకూరి శ్రీరాములు**
సీనియర్ తెలుగు లెక్చరర్
తపస్య డిగ్రీ కాలేజ్ సికింద్రాబాద్

# సినిమాల్లో విలన్ నిజ జీవితంలో హీరో




**నల్లగొండ మట్టిసారం**
**ప్రభాకర్ రెడ్డి**
**ఎన్నాళ్ళు నిలిచాడు**
**ఎదురొడ్డి....** (పున్నమి 'నల్లగొండ నానీలు' నుండి)

ఆయన సినిమాల్లో విలన్. కానీ నిజ జీవితంలో హీరో. మనం ఎంతో అభిమానించే రీల్ హీరోలకంటే పెద్ద రియల్ హీరో. ఆయన పేరు మందడి ప్రభాకర్ రెడ్డి. నటుడుగా, దర్శకుడుగా, నిర్మాతగా, రచయితగా, చిత్రసీమను ఏలిన ప్రభాకర్ రెడ్డి నల్లగొండ జిల్లా తుంగతుర్తి గ్రామంలో జన్మించారు. ఎం.బి.బి.ఎస్. చదివి డాక్టర్ కావాల్సి యాక్టరయ్యాడు. డైరెక్టరూ అయ్యాడు. 1960లో "చివరకు మిగిలేది" సినిమా ద్వారా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 472 సినిమాల్లో నటించాడు. నటనతోపాటు సుమారు 25 సినిమాలకు కథ, మాటలు రాశారు.

తెలుగు చలన చిత్రరంగం హైదరాబాద్‌లో స్థిరపడటానికి ప్రభాకర్ రెడ్డి ఎనలేని కృషి చేశారు. నాటి ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి గారితో ఉన్న సాన్నిహిత్యం వల్ల సినీ పరిశ్రమ పక్కాగా స్థిరపడటానికి ఎన్నెన్నో రాయితీల్ని వెసులుబాటుని ప్రభుత్వం నుండి సాధించిన ప్రతిభాశాలి ప్రభాకర్ రెడ్డి.

ఆ మహానుభావుని గురించి ఎంత రాసినా తక్కువే అవుతుంది. కానీ చంద్రునికో నూలు పోగులా ప్రభాకర్ రెడ్డి గారి సినీ జీవితం గురించి సంక్షిప్త చరిత్ర ...

**(జులై 1 ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా...)**



- పున్నమి
సెల్:92464 10639

మన దేశంలో మొట్టమొదటి కథాచిత్రం నిర్మించిన గౌరవం దాదా సాహెబ్ ఫాల్కేకి దక్కుతుంది ఆయన కంటే ముందు 1910లో ఆర్.జి. టోర్నీ అనే ఆయన "పుండలీక్" అనే నాటకం నడుస్తుండగానే యథాతథంగా చిత్రీకరించి విడుదల చేశారు.

1904 లో దండిరాజ్ గోవింద ఫాల్కే (30-4- 1870- 16-2-1944) లైఫ్ ఆఫ్ క్రైస్ట్ అనే చిత్రాన్ని చూడటం జరిగింది. ఎట్టకేలకు 1913లో 'రాజా హరిశ్చంద్ర'ను నిర్మించి ప్రదర్శించారు. మే 3 వ తేదీన బొంబాయిలోని కొరొనేషన్ ధియేటర్లో దీన్ని విడుదల చేశారు. దీనితో ఆయన భారత చలనచిత్ర పితామహుడుగా నిలిచిపోయారు. ఆయన పేరు మీద భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన "ఫాల్కే అవార్డు"ను నెలకొల్పి సినిమారంగంలో విశేష కృషి సల్పిన కళాకారులను ప్రతి ఏటా సత్కరించటం జరుగుతుంది.

ఫాల్కే నిర్మించిన సినిమాలలో సావిత్రి, లంకాదహన్, సిన్హసరిళా, కృష్ణ జన్మ, భస్మా సురమోహిని మొదలైనవి ఉన్నాయి.

### మూకీల నుంచి టాకీలలోకి...

ప్రపంచంలో తొలి టాకీ చిత్రం 'జాజ్ సింగర్'ని అమెరికా అందించింది. అటు పిమ్మట రెండు సంవత్సరాలలో మొదటి భారతీయ టాకీ చిత్రం ఆలం ఆరా 1931లో విడుదలైంది. దీనికి అర్దెషిర్ ఇరానీ దర్శకత్వం వహించారు. బొంబాయి మెజిస్టిక్ ధియేటర్లో దీని ప్రదర్శన ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ సినిమాలో 12 పాటలున్నాయి. జుబేదా, మాస్టర్ విఠల్, ఎలిజర్ మోడీ, జగదీశ్ సేథీ మొదలైన వారు నటించారు. 40 వేల రూపాయల నిర్మాణ వ్యయంతో రూపొందిన ఈ చిత్రానికి ప్రత్యేకంగా సంగీత దర్శకులంటూలేరు.

హెచ్.ఎం.రెడ్డి తెలుగులో తొలి టాకీ చిత్రం "భక్త ప్రహ్లాద"కు శ్రీకారం చుట్టారు. తమిళంలో తొలి టాకీ 'కాళిదాసు'ను కూడా తనే నిర్మించారు. అందువల్ల ఆయనను దక్షిణ భారత టాకీ చిత్రాల పితామహుడుగా అభివర్ణిస్తారు.

1938లో గూడవల్లి రామబ్రహ్మం నిర్మించిన 'మాలపిల్ల' విజయ పతాకాన్నందుకుంది. సమాజంలో పాతుకుపోయిన అంటరాని తనం మీద కొరడా ఝుళిపిస్తూ ఒక సనాతన బ్రాహ్మణుడు మాలపిల్లను ప్రేమించి పెళ్లి చేసుకునే ఇతివృత్తంతో విమర్శనాత్మక చిత్రం నిర్మించి తెలుగు సినిమాని అభ్యుదయ పథంలోకి నడిపించారు. అలాగే 1939లో జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా "రైతు బిడ్డ" అనే మరో అభ్యుదయ చిత్రాన్ని నిర్మించారు. బి.ఎన్.రెడ్డి 'వందేమాతరం' చిత్రాన్ని, సి.పుల్లయ్య 'వరవిక్రయం' అనే సినిమానీ నిర్మించి చరితార్థులయ్యారు.

### దక్షిణ భారత సినిమా

1919 నుంచి మద్రాసులోనూ ప్రాంతీయంగా చలనచిత్ర నిర్మాణం ప్రారంభమైంది. మొదటి దక్షిణ భారత చలనచిత్రం (మూకీ)గా 1919లో నటరాజ మొదలియార్ తమిళంలో ''కీచక వధమ్'' నిర్మించారు. 1922లో తెలుగులో మొదటి మూకీ చిత్రం "భీష్మ ప్రతిజ్ఞ"ను రఘుపతి వెంకయ్య నాయుడు కుమారుడు ఆర్.యన్.ప్రకాష్ నిర్మించారు.

నిజాం వ్యతిరేక పోరాటాలు చాలా ఉధృతంగా జరుగుతున్న రోజులవి. తెలంగాణ సాయుధ పోరాట ప్రభావాలు ఎందరినో చైతన్య పరిచి కవులు, రచయితలు, కళాకారులుగా తీర్చిదిద్దింది. అలాంటి రోజుల్లో సాహిత్యం, కళలపట్ల ఆసక్తిని పెంచుకున్న ప్రభాకర్ రెడ్డి పదకొండేళ్ళ ప్రాయంలోనే బుర్రకథలో మేటి అయిండు. సై....సై....అంటూ రౌద్రంగా కళ్లు పెద్దవి చేసి ప్రేక్షకుల రక్తాన్ని ఉడుకెత్తించేవాడు. దాంతోనే ప్రభాకర్ రెడ్డిలోని నటనాశక్తి బయటపడింది. అదే ఆయన నట జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది.

**జననం :** ప్రభాకర్ రెడ్డి 1935 జూలై 1న నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామంలో మందడి లక్ష్మారెడ్డి కౌసల్య దంపతులకు రెండో సంతానంగా జన్మించాడు. మందడి సుధాకర్ రెడ్డి, మందడి రాంరెడ్డి, మందడి శేఖర్‌రెడ్డి అన్నదమ్ములు. వీరిది భూస్వామ్య కుటుంబం. మందడి లక్ష్మారెడ్డి తుంగతుర్తి చుట్టుపక్కల 40 గ్రామాలకు దొర.

**విద్యాభ్యాసం :** ప్రభాకర్ రెడ్డి ప్రాథమిక విద్య, ఉన్నత విద్య సూర్యాపేటలోనే జరిగింది. సూర్యాపేట నుండి హైదరాబాదుకు వెళ్లి సిటీ కాలేజీలో ఇంటర్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్. చదివాడు.

నాటకాల ప్రదర్శన : ప్రభాకర్ రెడ్డి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్ నాటకాలంటే మోజు పడి కాలేజీలో ఎం.బి.బి.ఎన్ చదువుతున్న రోజుల్లోనే నాటకాలంటే మోజుపడి ఏదో ఒక నాటకంలో వేషం వేయించుకుని స్టేజీపై మంచి నటనను ప్రదర్శించేవాడు. అలా నాటకాల్లో వేషాలు వేయడం ప్రారంభించాడు ప్రభాకర్‌రెడ్డి. గుమ్మలూరి శాస్త్రి దర్శకత్వంలో రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన 'చాణక్య చంద్రగుప్త' నాటకంలో సెల్యూకస్‌గా నటన ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో అప్పటిదాకా ఆగిపోయిన నాటకాల ప్రదర్శన ప్రభాకర్ రెడ్డి రాకతో మళ్లీ ఊపందుకుంది. ప్రభాకర్ రెడ్డి ఉత్సాహాన్ని చూసి ప్రొఫెసర్లు మరింతగా ప్రోత్సహించడం మొదలు పెట్టారు. ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్న ప్రతి పోటలోనూ ఏదో ఒక బహుమతిని గెలుచుకొని వచ్చేవాడు. ఈ పరంపరలో హైదరాబాదులో జరిగిన అంతర్-విశ్వ విద్యాలయ నాటక పోటీల్లో తన బృందంతో ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నాడు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వచ్చిన ప్రముఖ సినీ దర్శకులు గుత్తా రామినీడు, తాపీ చాణక్యలు ప్రభాకర్ రెడ్డి నటనను చూసి ప్రత్యేకంగా అభినందించి తమ సినిమాల్లో అవకాశం ఇస్తామని మాటిచ్చారు. ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న సినిమా అవకాశం తనంత తానుగా నడచి వచ్చినట్లయ్యింది ప్రభాకర్ రెడ్డికి.

అన్ని రంగాలలో అగ్రగామిగా వున్న నల్లగొండ జిల్లా సినిమా రంగంలో కూడా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి సినిమా రంగంలోకి ప్రవేశించిన మొదటి వ్యక్తుల్లో కోదాడకు చెందిన తాడేపల్లి లక్ష్మీకాంతారావు (టి.ఎల్. కాంతా రావు)ను పేర్కొనవచ్చును. అయితే కాంతారావు కంటే ముందే 1952లో శుభోదయ యూనిట్ పేరుతో "ఆదర్శం" సినిమాను నిర్మించిన ఘనత కోదాడ వాసులకే దక్కింది.

1951లో నల్లగొండ జిల్లా కందిబండ, గణపవరం, దేశ్‌ముఖ్‌లు కలిసి మద్రాసులో సినిమా తీయడానికి వెళ్లారు. హెచ్.వి.బాబు దర్శకత్వంలో షావుకారు జానకి, జగ్గయ్య, సావిత్రి, రామశర్మ, ఆత్రేయ (పాటల రచయిత) గౌరినాథ శాస్త్రిలతో "ఆదర్శం" (1952) సినిమా తీశారు. ఈ సినిమాకు తెలంగాణకు చెందిన బి.ఎస్.నారాయణ, టి.కృష్ణ (ఎడిటర్) ఎం.వి.రాజులు వివిధ శాఖల్లో పని చేశారు. ఈ సినిమా రూపకర్తలు నారపరాజు జానకి రామారావు, నారపరాజు సీతారామారావులు కోదాడ వాసులు. ఈ చిత్రం విజయవంతం కాకపోయినా తెలుగు సినిమాల్లోకి తెలంగాణ వారి ప్రవేశానికి ఒక ద్వారమైంది.

1930లో తెలుగు సినిమా ప్రారంభమైనప్పటికీ 1955 వరకు చెప్పుకోదగ్గ సంఖ్యలో తెలంగాణ ప్రాంతం వాళ్లు సినిమా రంగంలోకి ప్రవేశించలేదు. నటీనటులుగాని, సాంకేతిక నిపుణులు గానీ నిర్మాతలు గానీ లేరనే చెప్పాలి. అలాంటి సమయంలో కోదాడకు చెందిన కాంతారావు 1950లో సినిమాలలో నటించాలనే లక్ష్యంతో మద్రాసు చేరుకున్నారు. అక్కడ ఆయన హెచ్.ఎం.రెడ్డిని కలుసుకున్నారు. అప్పుడాయన "నిర్దోషి" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే పాత్రల ఎంపిక పూర్తయినందున తాము నిర్మించే తదుపరి చిత్రంలో కాంతారావుని కథానాయకుడుగా తీసుకుంటానని ఆయన మాట ఇచ్చారు. పైగా నిర్దోషి చిత్రంలో కాంతారావుకు ఒక పల్లెటూరి వాడి వేషం ఇచ్చారు. తర్వాత సినిమా కోసం దాదాపు మూడు సంవత్సరాలు నిరీక్షించిన తర్వాత ఫలితం దక్కింది. ఇంకేం కాంతారావు తన ప్రతాపమంతా చూపారు. అదే సినిమా తమిళ ప్రతి నంజమ్‌లో నాయకుడుగా కాంతారావుకు ఎంపికయ్యారు. తర్వాత జానపద కథానాయకుడిగా గొప్ప పేరు వచ్చింది. సప్తస్వరాలు, గండరగండడు, ప్రేమ జీవులు, గుండెలు తీసిన మొనగాడు మొదలైన చిత్రాలను నిర్మించారు. దాదాపు 450 సినిమాల్లో నటించి ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రలు పోషించారు. లవకుశ చిత్రంలో ఆయన నటించిన లక్ష్మణుడు పాత్రకు జాతీయ అవార్డు లభించింది.

1952లో మద్రాసు వెళ్లిన కాంతారావు హెచ్.ఎం.రెడ్డి కంట్లో పడి "ప్రతిజ్ఞ" (1953) చిత్రంలో హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత దాదాపు 50 జానపద చిత్రాల్లో తనదైన విలక్షణ ముద్రతో నటించారు. విఠలాచార్య, రాజనాల కృష్ణకుమారి, రాజశ్రీలతో ఆయనది విజయవంతమైన జట్టు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎం.వి. రాజు సంగీత దర్శకుడు. "భక్త కనకదాస" అనే కన్నడ చిత్రానికి గాను 1960లో జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడి అవార్డు అందుకున్నారు. టి.కృష్ణ ఎడిటర్‌గా 300 చిత్రాలకు పనిచేశారు. బి.ఎస్.నారాయణ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వాస్తవ్యుడు. ఊరుమ్మడి బతుకులు, నిమజ్జనం, మార్గదర్శి లాంటి జాతీయ అవార్డు సినిమాలు తీశారు. ఆదర్శం వేసిన దారిలో మద్రాసు వెళ్లి సినిమాల్లో విజయవంతమైన వారిలో వీరందరినీ పేర్కొనవచ్చును.

×××

హైదరాబాదు వి.వి.కాలేజీలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, ఎమ్మెస్సార్, పాల్వాయి గోవర్ధన్ రెడ్డిలు, వాస్తుశిల్పి మంచి మిత్రులు. 1955-56 సంవత్సరంలో ఎన్.ఎస్.యు ఐ ప్యానల్‌కు పురుషోత్తం రెడ్డి కీలక వ్యక్తి. అదే సంవత్సరం ప్యానల్ గెలిచింది. కాలేజీ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షులుగా పాల్వాయి గోవర్ధన్ రెడ్డిలు ఎన్నికకాగా రెడ్డి హాస్టల్ అధ్యక్షుడిగా గుర్రం విద్యాసాగర్ రెడ్డి (సూర్యాపేట) ఎన్నికయ్యారు.

ఉప్పునూతల పురుషోత్తం రెడ్డిది నల్లగొండ జిల్లా మోత్కూరు మండలం అడ్డగూడూరు సొంతూరు ఆయన హైదరాబాదులో విద్యార్థి నాయకుడి నుంచి యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ఎదిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఎందరితోనో పరిచయాలు ఏర్పడ్డాయి. తెలుగులో వచ్చిన సాహిత్యంతో పాటు శరత్ సాహిత్యాన్ని కూడా చదివారు. ఆయన కళాభిరుచి కలిగిన వ్యక్తి.

ఆ రోజుల్లో హైదరాబాదులోని సారధి స్టూడియోలో నిర్మించిన పర్వతనేని గంగాధరరావు తొలిచిత్రం "మా ఇంటి మహాలక్ష్మి" సినిమా విడుదలైంది. ఆ సినిమా దర్శకుడు గుత్తా రామినీడు, జమున, హరనాథ్, గుమ్మడి తదితరులు నటించిన ఈ సినిమా చాలా ప్రజాదరణ పొందింది. అంతేగాక జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికై అవార్డు వచ్చింది. దర్శకునికి ఈ సినిమా మంచిపేరు తెచ్చి పెట్టింది.

హైదరాబాదులోని నిజాం కళాశాలలో వివిధ కళాశాల విద్యార్థులు ఆంధ్ర అభ్యుదయ రాత్రువాలు పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏటా జరిగే ఈ సాంస్కృతికోత్సవాలకు ఒకనాడు దర్శకుడు గుత్తా రామినీడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ "యమలోకంలో కరప్షన్" అనే నాటకం ప్రదర్శన జరిగింది. అందులో ఉస్మానియా మెడికల్ కాలేజీలో చదువుతున్న ప్రభాకర్ రెడ్డి నటించాడు. ఆయన నటన గుత్తా రామినీడుకు బాగా నచ్చింది. ప్రభాకర్ రెడ్డికి బహుమతి కూడా వచ్చింది.

ఆ రోజుల్లో కొందరు సినిమా నిర్మాతలకు కథలు బెంగాలీ చిత్రాలే ఆధారంగా ఉండేవి. అలా బెంగాల్‌లో విజయవంతమైన చిత్రాల హక్కులు కొనుక్కొని దక్షిణ భారత భాషల్లో నిర్మించేవారు. ఆ రోజుల్లో సుచిత్రా సేన్ టాప్ హీరోయిన్. ఆమె నటించిన "దీప్ జలే జాయ్" దర్శకుడు రామినీడుకు బాగా నచ్చింది. హౌస్‌ఫుల్‌గా నడుస్తోంది. మంచి "టాక్" ఉంది. సినిమాలో కొత్తదనం కనిపిస్తోంది. వెంటనే గుత్తా రామినీడు ఉప్పునూతల పురుషోత్తం రెడ్డితో మాట్లాడి ఆ సినిమా రైట్స్ (హక్కులు) కొందామని ఒక నిర్ణయానికి వచ్చి ఆ సినిమా నిర్మాత దగ్గరకెళ్లి దక్షిణ భారతదేశ భాషల్లో ఆ సినిమా తీసేందుకు హక్కులను కొన్నారు. ఒక ప్రింట్‌తో సహా స్క్రిప్టు ఇచ్చాడు నిర్మాత. వాటిని తీసుకొని హైదరాబాదుకు వచ్చిన రామినీడు గన్‌ఫౌండ్రిలోని వైట్‌హౌస్‌లో ఆ సినిమా వేసి అక్కినేని నాగేశ్వరరావుకు చూపించారు. ఆ సినిమాలో నటించాల్సిందిగా రామినీడు, పురుషోత్తం రెడ్డి కోరారు.

ఆ సినిమా చూశాక ''ఇది హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా. హీరోకు అంతగా ప్రాధాన్యత లేదు" అని అన్నాడు అక్కినేని అంతేగాక "కమర్షియల్‌గా ఈ సినిమా ఆడుతుందా? లేదా? అని చూసుకోండి. ఎందుకంటే తెలుగు ప్రేక్షకులు ఇలాంటి సినిమాలు ఆదరిస్తారా? అన్నది నా అనుమానం... అని కూడా అక్కినేని చెప్పారు. హీరోయిన్ ఓరియంటెడ్ అంటున్నారు కదా? ఎవరిని బుక్ చేస్తే బాగుంటుందంటారు? అని అడిగితే ఆయన వెంటనే సావిత్రి పేరును సూచించారు. అప్పుడు దక్షిణాది సినిమా రంగంలో సావిత్రి ఓ వెలుగు వెలుగుతోంది. పూర్తి బిజీ ఆర్టిస్టు. కాబట్టి జమునను నర్సు పాత్రలో తాను తప్పక నటిస్తానని చెప్పింది.

బెంగాలీ స్క్రిప్టును ఆంగ్లంలోకి అనువాదం చేశారు సహనిర్మాత సుధాకర్ రెడ్డి. ఆంగ్లం నుండి ఆ అనువాదాన్ని తెలుగులోకి తర్జుమా చేశారు. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా "శోభ" అనే ఆర్టిస్టును తీసుకున్నారు. అంతకు ముందు చాణక్య సినిమాలో ఆమె నటించింది. మధుబాలలా ఉంటుంది. ఇక సినిమా టైటిల్ పేరును "చివరకు మిగిలేది" ఖరారు చేస్తే అది నిర్మాత పురుషోత్తం రెడ్డికి నచ్చలేదు. ఆయన "అనురాగం" పేరును సూచించారు. అది సాదా సీదాగా అనిపిస్తుంది. పది మందిని ఆకర్షించే శక్తిగల పేరుండాలని తర్జన భర్జనలు చేసి చివరికి "చివరికి మిగిలేది" అనే పేరును ఖరారు చేశారు. ఆ పేరుతో బుచ్చిబాబుగారి నవల అంతకు ముందే వచ్చిందన్న అనుమానం కొందరిలో కలిగింది. మొత్తం మీద "చివరికి మిగిలేది" అనే పేరు చాలా మందిలో ఉత్సుకతను, ఉత్కంఠతను రేకెత్తించిందనే చెప్పాలి.

ప్రభాకర్ రెడ్డి తొలిచిత్రం **"చివరకు మిగిలేది"** (1960)
దర్శకుడు: గుత్తా రామినీడు
నిర్మాత: ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి
నటీనటులు :సావిత్రి, కాంతారావు, ప్రభాకర్ రెడ్డి, బాలయ్య, హరనాథ్‌లతో పాటు హాస్యనటులు రమణారెడ్డి, రాజబాబు, బాలకృష్ణ, కుటుంబరావు, నల్లా రామ్మూర్తి, సీతారాం, సెకండ్ హీరోయిన్ శోభ. ఈ సినిమాలో ప్రభాకర్ రెడ్డిది డాక్టర్ పాత్ర కావడం విశేషం. మంజీరా పతాకంపై 1960 అక్టోబర్‌లో విడుదలైన ఈ సినిమాలో ప్రభాకర్ రెడ్డి మానసిక వైద్యుడి పాత్ర పోషణలో తెలుగు సినిమా పరిశ్రమకు పరిచయమయ్యాడు.

పిచ్చాసుపత్రి నేపథ్యంలో నడిచే సినిమా. విఫల ప్రేమతో పిచ్చి వాళ్లయిన పేషెంట్లతో ప్రేమ నటిస్తూ వాళ్లను బాగుచేసే నర్సు పాత్రలో సావిత్రి జీవించారు. గుండెల్లో బడబానలాన్ని దాచుకుని విషాదాన్ని ఒలికించిన తీరు ఇప్పటికీ సజీవం.

బెంగాలీ చిత్రం "దీప్ జలే జాయ్" ఆధారంగా తీసినా మాతృకను మించే స్థాయిలోనే రూపొందింది. ఈ సినిమాలో ఆరు పాటలున్నాయి. నాల్గు పాటలు మల్లాది రామకృష్ణశాస్త్రి

"సినిమా కూడా వ్యాపారమే కాదని చెప్పను. కాని సామాజిక బాధ్యతను విస్మరించరాదు. వినియోగదారుడికి కల్తీ సరుకు అమ్మితే అది నేరం. అలాగే సినిమా చూసే ప్రేక్షకుడికి కల్తీ వినోదం అందిస్తే అది కూడా నేరం కిందికే వస్తుంది. అలాగని సినిమాల్లో రొమాన్సు వుండరాదని. స్టంట్స్ నృత్యాలు పనికిరావని నేననడం లేదు. సమాజాన్ని బాగుచేయక పోయినా సినిమా ద్వారా పాడుచేయకూడదని నా అభిప్రాయం. - ప్రభాకర్ రెడ్డి

ఒక్కో పాటను కొసరాజు, ఆరుద్ర రాశారు. ఎం.ఎస్.నారాయణ, ఘంటసాల, సునంద అనే నూతన గాయని పాటలు పాడారు.

ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు 'మా టీవీ'లో ఒక కార్యక్రమంలో బెంగాలీ నటి సుచిత్రాసేన్ నటన, ఖామోష్ చిత్రంలో వహిదా రహమాన్ నటన, తెలుగులో 'చివరకు మిగిలేది' చిత్రంలో సావిత్రి ఈ ముగ్గురి నటీనటుల నటనా వైదుష్యాన్ని ప్రేక్షకులకు చూపారు. ముగ్గురిలో సావిత్రి నటన అద్భుతం, అమోఘం అని అక్కినేని వ్యాఖ్యానించారు.

"ఎ లిజెండరీ ఆక్ట్రెస్ మహానటి సావిత్రి" అన్న శీర్షికతో 2009వ సంవత్సరంలో వి.ఆర్.మూర్తి (న్యూయార్క్) వి.సోమరాజు (హైదరాబాదు) 600 పేజీల ఒక ఆంగ్ల పుస్తకం ప్రచురించారు. ఆ పుస్తకం కవర్ పేజీపై "చివరకు మిగిలేది" క్లైమాక్స్ స్టిల్‌ను ఉపయోగించారు. చివరకు మిగిలేది చిత్రంలోని సావిత్రి నటనను ఆ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఈ సినిమాను ప్రయోగాత్మకంగా తీసినా ఆర్థికంగా కోలుకోని దెబ్బ తీసింది. సినిమా వ్యాపారపరంగా విజయం పొందకపోయినా విమర్శకుల ప్రశంసలందుకున్నది. ప్రభాకర్ రెడ్డి నటన చాలా మందికి నచ్చింది. సావిత్రిని నటిగా మరో మెట్టుపైన నిలబెట్టిందీ చిత్రం.

### లక్ష్మీ దీపక్‌తో పరిచయం

ప్రభాకర్ రెడ్డికి తొలిచిత్రం "చివరకు మిగిలేది"లో నటిస్తున్నప్పుడే లక్ష్మీ దీపక్‌తో పరిచయమైంది. ఆ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు దీపక్. ఈయన కూడా తెలంగాణా వాడే. హైదరాబాదీ కావడం వల్ల ఇద్దరికీ మంచి స్నేహం కుదిరింది. మంచి ప్రతిభ వున్న లక్ష్మీ దీపక్‌ను తానే దర్శకుడుగా పరిచయం చేస్తూ తొలిసారిగా నిర్మించిన సినిమా "పచ్చని సంసారం" (1970). కృష్ణ, వాణిశ్రీ నటించిన ఈ సినిమా హిట్ కావడంతో వీరి కాంబినేషన్‌లో వచ్చిన "పండంటి కాపురం" (1972) పెద్ద విజయం సాధించింది. పండంటి కాపురం తర్వాత ప్రభాకర్ రెడ్డి లక్ష్మీ దీపక్ డైరెక్షన్‌లో "గాంధీ పుట్టిన దేశం" (1973) నాకూ స్వతంత్రం వచ్చింది (1975) కార్తీక దీపం (1979) వంటి విజయవంతమైన సినిమాలు నిర్మించారు.

### విలన్‌కు చిరునామా...

తెలుగు సినిమాల్లో 'విలన్' అంటేనే గుర్తొచ్చే వారు ప్రభాకర్ రెడ్డి. ఆయన తర్వాత సినీ పరిశ్రమలోకి వచ్చిన సత్యనారాయణ, త్యాగరాజు వంటి వారి కాంబినేషన్‌లో సైతం ఆయన అద్భుతంగా నటించారు. ఈ నేపథ్యంలో ఆయన పునర్జన్మ (1963). దొరికితే దొంగలు (1965) మొనగాళ్ళకు మొనగాడు, రక్త సింధూరం, ఉమ్మడి కుటుంబం (1960) కంచుకోట (1967) మాతృదేవత, జగత్ కిలాడీలు (1967) మారిన మనిషి (1970) రామాలయం (1971) నిజరూపాలు, అమ్మ మాట, కూతురు-కోడలు, కిలాడీ బుల్లోడు (1972) ఒకనారి వంద తుపాకులు, దేశోద్ధారకులు (1973) అల్లూరి సీతారామరాజు, కన్నవారి కలలు, అందరూ దొంగలే, నిప్పులాంటి మనిషి (1974) కథానాయకుని కథ (1975) గోరింటాకు, యుగంధర్, సంఘం మారాలి (1979) గురు, రాముడు- పరశురాముడు (1980) ఆయన కలియుగదైవం సంఘర్షణ (1983) తదితర చిత్రాల్లో దుష్ట పాత్రల పోషణలో ఒక ఒరవడితో విలక్షణ నటనాశైలితో తనదైన ఒక శకాన్ని నెలకొల్పుకున్నారు. కృష్ణ నాయకునిగా రూపొందిన 'పలుకే బంగారం', 'మొనగాళ్ళకు మొనగాడు' చిత్రాల్లో నెత్తి మీద టోపీ, చేతిలో తుపాకీ, మరో చేతిలో చుట్ట కాలుస్తూ హాలీవుడ్ తరహా విలన్ పాత్రలు నిర్వహించడం ఓ వెరైటీ. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఎన్.టి.ఆర్., కృష్ణ హీరోలుగా రూపొందిన పలు చిత్రాల్లో విలన్ పాత్రల పోషణలో వైరుధ్యం చూపారు.

### దర్శకుడిగా...

ప్రభాకర్ రెడ్డి దర్శకుడిగా ఐదు చిత్రాలను రూపొందించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన తొలిచిత్రం "ప్రతిభావంతుడు" (1986). ఆ తర్వాత కొన్ని రాజకీయ కారణాల వల్ల ఎన్.టి.రామారావుకి వ్యతిరేకంగా "మండలాధీశుడు" (1987) ప్రచండ భారతం (1988) గండిపేట రహస్యం (1989) వంటి చిత్రాలను రూపొందించారు.

### నిర్మాతగా...

గాంధీ పుట్టిన దేశం, నాకూ స్వతంత్రం వచ్చింది, పల్లె పిలిచింది, యువతరం కదిలింది, ధర్మాత్ముడు, గృహప్రవేశం, కార్తీకదీపం, కళ్యాణ తిలకం వంటి చిత్రాలు ప్రభాకర్ రెడ్డి నిర్మించగా అవన్నీ ప్రేక్షకాదరణ పొందాయి.

### కథా రచయితగా...

ప్రభాకర్ రెడ్డిని మనం విలన్‌గానే చూస్తాం. కానీ ఆయన కలం నుండి జాలువారిన కథాచిత్రాలు కార్తీక దీపం, పండంటి కాపురం, ధర్మాత్ముడు, నాకూ స్వతంత్రం వచ్చింది వంటి సినిమాల్లో మధ్య తరగతి కుటుంబ గాథలు, సామాజిక చైతన్యం కథాంశాలే ఉండటం గమనార్హం.

### పౌరాణిక పాత్ర ధారిగా...

ప్రభాకర్ రెడ్డిలో మంచి పర్సనాలిటీ, వాయిస్‌లో మెచ్యూరిటీ, రకరకాల వైబ్రేషన్స్ అన్నీ వుండటం తో పౌరాణిక, జానపద చిత్ర పాత్ర పోషణకు ఎంతో దోహదపడ్డాయి.

1961లో బి.ఎ.సుబ్బారావు తీసిన "భీష్మ" చిత్రంలో శంతనుడుగా, నర్తనశాల (1963)లో సరస్వతి శపథం (1966)లో బ్రహ్మగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి మహత్యం (1980) శ్రీకృష్ణావతారం చిత్రంలో బలరాముడుగా ఇంకా ధర్మరాజు వంటి పాజిటివ్ పాత్రలలో చక్కని ప్రతిభను కనబరిచి గొప్పగా నటించి మెప్పించగలనని నిరూపించారు. పల్నాటి యుద్ధం చిత్రంలో నాయకురాలు నాగమ్మ (భానుమతి)కి ప్రధాన అంగరక్షకుడైన కన్నమదాసు పాత్రలో సంభాషణలతో నిమిత్తం లేకుండా కేవలం కంటి చూపుతో భావ ప్రకటన చేసి "భళా" అనిపించారు. మహామంత్రి తిమ్మరుసు, వీరభద్ర గజపతి, అల్లూరి సీతారామరాజు (మల్ల దొర) చిత్రాల్లో ఆవేశపూరితమైన పాత్రలు నిర్వహించటం చెప్పుకోదగ్గ విశేషం.

### జానపద చిత్రాల్లో ..

కంచుకోట, అగ్ని కిరీటం, లక్ష్మీ కటాక్షం వంటి జానపద చిత్రాల్లో సేనానిగా, మాంత్రికుడిగా, మహారాజుగా విభిన్న భూమి కల్ని పోషించడం ప్రశంస నీయం.

### క్యారెక్టర్ యాక్టర్‌గా...

ప్రభాకర్ రెడ్డి కేవలం విలన్ పాత్రలకే పరిమితం కాలేదు. ప్రేక్షకుడిలా సానుభూతిని పొందే క్యారెక్టర్ రోల్స్‌ను కూడా అద్భుతంగా పోషించి మెప్పించారు. "హరిశ్చంద్రుడు" నాకూ స్వతంత్రం వచ్చింది, పండం టి కాపు రం, రెండు కుటుంబాల కథ, తీర్పు చిత్రాలలో నటించారు.

### కామ్రేడ్‌గా...

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనా శైలితో మూడున్నర దశాబ్దాలు 472 సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి అశేషాంధ్ర, తెలంగాణ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ప్రభాకర్ రెడ్డి తెరపై వెలిగినా వెలగని 'కామ్రేడ్'. ఆయన ఎన్.టి.రామారావు తెలుగు దేశం పార్టీ నెలకొల్పాక రాజకీయ వ్యంగ్య చిత్రాలకు కథలు సమకూర్చడం, దర్శకత్వం వహించడం చేశారు. ఎన్టీ రామారావుకు వ్యతిరేకంగా మండలాధీశుడు, ప్రచండ భారతం, గండి పేట రహస్యం సినిమాలను నిర్మించారు. వీటిలో ప్రచండ భారతం, వర్మ ఆర్ట్ పిక్చర్స్ నిర్మించగా విజయనిర్మల లాయర్‌గా, నరేష్ తిరుగు బాటు ప్రతినిధిగా నటించిన ఓ చిత్రం వంటివి ఉదాహర ణలు.

ఎన్టీ రామారావు పార్టీ పెట్టే సమయానికి చిత్ర పరిశ్రమ రెండు వర్గాలుగా చీలిపోవడం. ఈ కారణంగా ఒక వర్గం వారు మరొక వర్గం వారిని ఏవగించు కోవడం. విభేదాలు సృష్టించు కోవడం, అర్థంలేని ఆరోప ణలు చేయడం వంటివి ఏర్పడ్డాయి. రాజకీయం మీద ఆసక్తి ఉండడం, రాజకీయాలు కుళ్ళిపోవడం వలన రాజకీ య వూపు చిత్రాల వేపు దృష్టి సాధించడం జరిగిం దని ఆనాడే ప్రభాకర్ రెడ్డి అన్నారు.

వ్యక్తిగా ప్రభాకర్ రెడ్డి వామపక్ష భావాలు కలిగిన వారు. ధర్మబిక్షం తన గురువుగా చెప్పుకున్న ప్రభాకర్ రెడ్డికి తెలంగాణ ఉద్యమం బాగా తెలుసు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యం కూడా బాగా తెలుసు.

### 1967లో శ్రీకాకుళం ఉద్యమం...

వెంకట్రావు, సత్యం, కైలాసం వంటి వారితో ఆయనకు పరిచయం వుంది. గిరిజనుల, దళితుల సమస్యలపై మంచి అవగాహన వుంది. అందుకే ఆయన "కామ్రేడ్" చిత్రం తీయడానికి పూనుకొని కథ రాసి దర్శక త్వం వహించారు. ఆయన దర్శకత్వంలో తయారైన చివ రి చిత్రం ఇది. ఈ చిత్రంలో కె.జి.సత్యమూర్తి మాస్టార్‌జి పాటలున్నాయి. ఎంతో పట్టుదలతో చిత్ర ని ర్మాణం పూర్తి చేసినప్పటికీ ఈ సినిమా విడుదల కాలేదు.

**'గృహప్రవేశం'** చిత్రం ద్వారా మోహన్‌బాబును హీరోగా ఫిల్మ్ ఇండస్ట్రీకి పరిచయం చేసిన ఘనత ప్రభాకర్ రెడ్డికే దక్కుతుంది. అలాగే 'ఎన్‌కౌంటర్' సినిమా దర్శకుడు ఎన్.శంకర్‌ని సినిమా రంగానికి తెచ్చింది కూడా ప్రభాకర్ రెడ్డిగారే. 1976లో 'భూమికోసం' చిత్రంలోని ఒక పాటతో 'లలితారాణి'గా సినీ పరిశ్రమలోకి సాదా సీదాగా ప్రవేశించిన నటికి జయప్రదగా నామకరణం చేసి తెలుగు చిత్రసీమకు ఒక అందమైన అద్భుత మైన నటిని పరిచయం చేసిన ఘనత కూడా ప్రభాకర్ రెడ్డికే దక్కుతుంది. 'జయప్రద' పిక్చర్స్‌ను స్థాపించి పలు చిత్రాలు నిర్మించారు. సూపర్‌స్టార్ కృష్ణతో కలిసి పలు సినిమాలకు నిర్మాతగా నిర్మాణ భాగస్వామ్యం వహించారు. ఎందరో హీరోలను సృష్టించిన క్యారెక్టర్ ఆయనది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం పోరాటం చేసే మనస్తత్వం కలిగిన ప్రభాకర్ రెడ్డి కొన్ని చిత్రాలతో కొంతమంది చిత్ర ప్రముఖులకు కూడా దూరమయ్యారు. వివాదాస్పద చిత్రాలను నిర్మించిన ప్రభాకర్ రెడ్డి దేనికీ భయపడలేదు. చక్కటి కుటుంబ కథా చిత్రాలను నిర్మించి అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆయన చేరువయ్యారు.

### మాండలికంలో...

గంగపుత్రుల వ్యథల కథలను హృద్యంగా విశాఖ మాండలికంలో బి.ఎస్.గణేశ్ పాత్రో రచించిన పావలా, కొడుకు పుట్టాల నాటికలను 1975లో డా॥ యం.ప్రభాకర్ రెడ్డి జయప్రదా ఆర్ట్ పిక్చర్స్ పతాకంపై పి.లక్ష్మీ దీపక్ దర్శకత్వంలో "నాకూ స్వతంత్రం వచ్చింది" అనే సినిమాగా నిర్మించారు. తెలుగు చలనచిత్ర సీమలో పూర్తిస్థా యి మాండలికంలో నిర్మించిన చిత్రం గా ఇది చరిత్ర పుటలకు ఎక్కింది.

రంగస్థలం పైనే గాక సినిమాల్లోనూ ఆయన విలక్షణతను చాటుకున్నారు. ఎవరైనా సినిమాల్లో పాత్రల కోసం వెంటపడుతుంటారు. కానీ కొన్ని పాత్రల పోషణకు గాను సినిమారంగమే ఆయన వెంటపడటం మొత్తం సినిమా చరిత్రలో ఒక్క భానుప్రకాశ్ విషయంలోనే జరిగింది.

1977లో తెలంగాణ సమాజాన్ని ఆవిష్కరించిన ''చిల్లర దేవుళ్లు'' సినిమాలో భానుప్రకాశ్ పోషించిన కరణం పాత్రలో మరొకరిని ఊహించలేము.

### భానుప్రకాశ్...

తెలుగునాట సాంఘిక నాటక వికాసానికి దోహదం చేసి తెలంగాణ రాష్ట్రంలో సాంఘిక నాటకానికి పట్టుగొమ్మగా నిలిచిన వ్యక్తి భాను ప్రకాశ్. భానుప్రకాశ్ పేరు చెప్పగానే నాటక ప్రియులకు గాలివాన, జీవన్నాటకం, ఒంటికాలి పురుగు, గాలి గోపురం, బాపూ బాటలో వంటి నాటకాలు బాగా గుర్తుకు వస్తాయి. భానుప్రకాశ్ పూర్తి పేరు బొల్లంపల్లి భాను ప్రకాశరావు. నల్లగొండ ముద్దుబిడ్డ. 1939 ఏప్రిల్ 21న నల్లగొండలో వెంకటహరి, ఆండాళ్లమ్మ దంపతులకు జన్మించిన భానుప్రకాశ్ విద్యార్థి దశలోనే కేశవ మెమోరియల్ హై స్కూల్‌లో చదువుతుండగా వార్షికోత్సవాల సందర్భంగా వేసిన "తారు మారు'' నాటకంలో మంచి వేషం వేశారు.

రంగస్థలంపైనే గాదు సినిమాల్లోనూ ఆయన విలక్షణ తను చాటుకున్నారు. ఎవరైనా సినిమాల్లో పాత్రల కోసం వెంటపడుతుంటారు. కానీ కొన్ని పాత్రల పోషణకుగాను సినిమారంగమే ఆయన వెంటపడటం మొత్తం సినిమా చరిత్రలో ఒక్క భానుప్రకాశ్ విషయంలోనే జరిగింది.

1963లో వి.ఎ.పి. వారి **"పునర్జన్మ"**లో మంచి ప్రాధాన్యత వున్న పాత్రలో నటించే అవకాశం వచ్చిన ప్రభాకర్ రెడ్డితో పాటు ఈ చిత్రంలో భానుప్రకాశ్ కూడా నటించడం విశేషం. "పునర్జన్మ"లో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో మంచిపేరు తెచ్చుకున్నారు ప్రభాకర్‌రెడ్డి.

1977లో తెలంగాణ సమాజాన్ని ఆవిష్కరించిన "చిల్లర దేవుళ్ళు" సినిమాలో భానుప్రకాశ్ పోషించిన "కరణం" పాత్రలో మరొకరిని ఊహించలేము.జీవితమే నాటకంగా, నాటకమే జీవితంగా గడిపిన భానుప్రకాశ్ ప్రభాకర్ రెడ్డి నటించిన సినిమాలో నటించి బాగా గుర్తింపు పొందారు.

### యడవెల్లి విజయేందర్ రెడ్డి..

నల్లగొండ జిల్లా అనుముల మండలం హాలియాకు చెందిన ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి సన్నిహితులు. మోహన్ బాబు హీరోగా నటించిన 'గృహప్రవేశం' మరియు 'కుంకుమ తిలకం' చిత్రాల నిర్మాత.

### మండల్ రెడ్డి కొండల్ రెడ్డి...

నూర్యాపేటలోని సోలిపేట గ్రామంలో 1933 జూన్ 22న మండల్ రెడ్డి నారాయణ రెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. వీరు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం దూరవిద్య ద్వారా "సినిమా కథ, కథనం, షో చిత్రం విశ్లేషణ" అనే అంశంపై ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంధాన్ని రాశారు. అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 2010 సంవత్సరానికి ఉత్తమ షార్ట్ ఫిలింకు లైఫ్ మెంబర్‌గా, సెన్సార్ బోర్డు సభ్యునిగా పని చేశారు. 1965లో "వీలునామా'' సినిమా తీశారు. ఇందులో ప్రభాకర్‌రెడ్డి ద్విపాత్రాభినయం చేశారు. ఈ చిత్రంలో డా॥ సి.నారాయణ రెడ్డి చేత నాలుగు పాటలు, దాశరథి చేత రెండు పాటలు రాయించారు. అశ్వత్థామ సంగీతాన్ని అందించారు.

### ఎన్.శంకర్...

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో జన్మించిన నిమ్మల శంకర్ చిత్ర విచిత్రంగా తెలుగు చిత్రరంగంలోకి ప్రవేశించారు. నల్లగొండలో పాలిటెక్నిక్ చదువుతున్న రోజుల్లో టౌన్‌హాల్‌లో జరిగిన కవిసమ్మేళనానికి హాజరై తాను రాసిన కవితను అక్కడి వారికి చదివి వినిపించాడు. ఆ నోట ఈ నోట శంకర్ ప్రతిభ తెలుసుకున్న ప్రభాకర్ రెడ్డి "సినిమాల్లో నువ్వు రాణిస్తావు" అని శంకర్‌ని మద్రాసుకి తీసుకు వెళ్ళాడు. అలా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన శంకర్ ప్రభాకర్ రెడ్డి ప్రోత్సాహంతో "భారతంలో శంఖారావం" అనే చిత్రానికి తొలిసారిగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్ శ్రీరాములయ్య, యమజాతకుడు, జయం మనదేరా, భద్రాచలం, ఆయుధం, రామ్ జై భోలో తెలంగాణ సినిమాలకు దర్శకత్వం వహించి ప్రభాకర్ రెడ్డి వారసత్వాన్ని నిల్పుకున్నారు.

### బి.భాస్కర్‌రావు...

లక్ష్మీ శ్రీదీపక్ తరువాత మరో హైదరాబాదీ డైరెక్టర్ బి.భాస్కర్ రావును ప్రభాకర్‌రెడ్డి ప్రమోట్ చేశారు. గృహప్రవేశం (1982) ధర్మాత్ముడు, కుంకుమ తిలకం (1983) సినిమాలు భాస్కర్‌రావు దర్శకత్వంలో నిర్మించారు. ఈ రకంగా తెలుగు సినిమారంగంలో తెలంగాణ వారిని ప్రోత్సహించారు ప్రభాకర్‌రెడ్డి.

ప్రభాకర్ రెడ్డి నటించిన అనేక సినిమాలలో తనదైన ముద్రవేశారు. ఆయన నటించిన రెండవ చిత్రం 'పాండవ వనవాసం' అందులో కర్ణుడి పాత్రతో రసజ్ఞులను మెప్పించారు. 'గృహప్రవేశం' సినిమాలో తన జులాయి తనంతో వ్యసనపరుడైన కొడుక్కి తండ్రిగా, గయ్యాళి భార్యకి అమాయక భర్తగా ఆయన ప్రదర్శించిన నటన అందరినీ ఆకట్టుకుంది. రక్త సంబంధం (1962) బొబ్బిలి యుద్ధం (1964) పల్నాటి యుద్ధం, నవరాత్రి (1966) ఉమ్మడి కుటుంబం, రక్త సింధూరం (1967) భలే తమ్ముడు, మాతృదేవత (1969) అక్కాచెల్లెలు, రెండు కుటుంబాల కథ (1970) మట్టిలో మాణిక్యం (1971) అమ్మ మాట, పండంటి కాపురం (1972) ఒక నారి వంద తుపాకులు (1973), అల్లూరి సీతారామరాజు (1974) దేవదాసు మళ్ళీ పుట్టాడు. యుగపురుషుడు (1978) గోరింటాకు (1979) నకిలీ మనిషి (1980) ముందడుగు (1983) అనుబంధం (1984) హరిశ్చంద్రుడు (1981) ఓ తండ్రి తీర్పు (1985) చిన్న కోడలు (1990) వంటి సుమారు వంద చిత్రాల్లో తండ్రిగా, తాతగా, మామగా, అన్నగా, స్నేహితుడిగా పాత్రలు పోషించి మెప్పించారు.

మంచి ప్రతిభ వున్న లక్ష్మీ దీపక్‌ను తానే దర్శకుడుగా పరిచయం చేస్తూ తొలిసారిగా నిర్మించిన చిత్రం "పచ్చని సంసారం" (1970). ఈ సినిమా హిట్ కావడంతో "పండంటి కాపురం" (1972) తీసి పెద్ద ఘన విజయం సాధించారు. ఎస్వీ రంగారావు, గుమ్మడి, కృష్ణలతో కలిసి నటిస్తూ తీసిన ఈ సినిమా తెలుగు సినిమా కుటుంబ కథా చిత్రాల్లో మైలురాయిగా నిలిచింది. ఈ సినిమాలు విజయవంతం కావడానికి ఆయన అందించిన బలమైన కథలు ఎంతగానో తోడ్పడ్డాయి. సామాజిక విషయాల్ని సామాన్యమైన, సున్నితమైన కుటుంబ వ్యవహారాన్ని కథా వస్తువులుగా తీసుకొని ఆయన మలిచిన కథలు, నడిపించిన కథనాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నేటికీ నిలిచిపోయాయి.

ఒక వ్యక్తిగా ప్రభాకర్ రెడ్డి ఎంతో సౌజన్యమూర్తి. సంస్కార హృదయుడు.

### పురస్కారాలు...

నటుడిగా, కథకుడిగా, నిర్మాతగా ప్రభాకర్ రెడ్డి పలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి అవార్డులను అందుకున్నారు. 'పల్లె పిలిచింది' (1981) చిత్రానికి 'యువతరం పిలిచింది' (ఉత్తమ నటుడిగా) చిత్రానికి కథా రచయితగా, గృహ ప్రవేశం, గాంధీ పుట్టిన దేశం చిత్రాలకు నంది జాతీయ స్థాయిలో 'ఉత్తమ ప్రాంతీయ చిత్రం' అవార్డులను అందుకున్నారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఏది తలపెట్టినా ప్రభాకర్‌రెడ్డి పట్టుదలతో కృషిచేసి అందుకు నిరంతరం శ్రమించేవాడు. ఇందుకు నిదర్శనమే ఆయన చిత్రం "పండంటి కాపురం" జాతీయ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది.

కళాకారులకు చేయూత...
సేవా తత్పరత...

మనం అభిమానించే హీరోలు ఎవరైనా ఒకరిని ఆదుకుంటేనే మా హీరో మనసు బంగారం అని చెప్పుకుంటాం. మా హీరో దానకర్ణుడని పొగిడేస్తాం కష్టం తెలిసిన రియల్ హీరో అని కీర్తిస్తుంటాం. కానీ ఇటువంటి హీరోలు ఎవరూ చేయలేని గొప్ప పనిని ప్రభాకర్ రెడ్డి చేశారు. హైదరాబాదులో కొంతస్థలం ఉంటే స్టూడియోనో, సినిమా హాలో కట్టుకుంటున్న హీరోలు ఉన్న సమయంలో ప్రభాకర్ రెడ్డి తన భూమిని సినీ కార్మికులకు ఇళ్ళ స్థలాల కోసం దానం చేశారు. ఇప్పుడు ఈ స్థలంలోనే చిత్రపురి కాలనీ ఏర్ప డింది.

సినిమాలనే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న సినీ కార్మికులకు గూడు ఇవ్వాలనే ఆలోచనతో ప్రభాకర్ రెడ్డి దానం చేసిన భూమి విలువ ఇప్పుడు అక్షరాలా 50 కోట్లు. ఆయన చలవ వల్లే ఇప్పుడు సినీ కార్మికులంతా స్వంతింట్లో ఉంటున్నారు. అందుకే మనం గొప్పగా చెప్పుకుంటూ అభిమానించే హీరోల కంటే ప్రభాకర్ రెడ్డి వెయ్యి రెట్లు గొప్పవాడు. ఆయన సినిమాల్లో విలన్ కావచ్చు. కానీ నిజ జీవితంలో మాత్రం హీరో.

ఆనాటి హీరోలకు ధీటుగా డబ్బులు సంపాదించారు. చిత్ర పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాదుకు వచ్చినప్పుడు అప్పటి హీరోలతో పాటు సినిమా ఇండస్ట్రీలో స్థలాలు కొనుగోలు చేశారు. ప్రభాకర్ రెడ్డి కూడా వారితో పాటు గచ్చిబౌలి సమీపంలో పదెకరాల స్థలం కొన్నారు. అయితే ఆనాటి హీరోలంతా హైదరాబాదులోని తమ స్థలాల్లో విలాసవంతమైన ఇళ్లు, సినిమా హాల్లు, సినీ స్టూడియోలు నిర్మించుకున్నారు. ప్రభాకర్ రెడ్డి మాత్రం తన స్థలాన్ని సినిమాలే జీవితంగా బతుకుతున్న సినీ కార్మికులకు దానంగా ఇచ్చారు. మద్రాస్‌లో ఉన్నప్పుడు కూడా ఆయన సినీ కార్మికులను బాగా చూసుకునేవారు. ఎందరికో తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చేవారు.

సినీ పరిశ్రమ మద్రాస్ నుండి

(మిగతా 4వ పేజీలో..)



3వ పేజీ తరువాయి..

హైదరాబాదుకు వచ్చాక ఆయన సినీ కార్మికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ సినీ కార్మికుల సమాఖ్యను ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా పనిచేశారు. హైదరాబాదు వంటి మహానగరంలో సినీ కార్మికుల సగం సంపాదన ఇంటి అద్దెలకే పోతున్నందున వారికి ఒక స్వంతిల్లు ఉంటే బాగుంటుందని అనుకున్నాడు.

సినిమా పరిశ్రమలో తెలంగాణా కళాకారులు అనాదిగా వివక్షకు గురవుతున్నారు. అందుకే ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోయారని తెలుసుకున్న ప్రభాకర్ రెడ్డి అలాంటి కళాకారులకు చేయూతనివ్వాలని సంకల్పించిన గొప్పదానశీలి. దాతృత్వ గుణమున్న మానవత్వం పరిమళించిన మహోన్నత వ్యక్తి.

ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల సంక్షేమం కోసం 1991లో "ట్విన్‌సిక్లబ్"ను నెలకొల్పి పేద కళాకారులకు 500 రూపాయల ఫించన్ ఇచ్చారు. ఏ.పి.ఫిల్మ్ వర్కర్స్ హౌసింగ్ సొసైటీకి చీఫ్ ప్రమోటర్‌గా ఆయన సినిమా కళాకారులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చివరిదాకా కృషి చేశారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చే ప్రభాకర్ రెడ్డి ఎందరో సినీ కార్మికులు అనారోగ్యంతో బాధపడినప్పుడు వారికి వైద్య సౌకర్యాలు కల్పించడానికి చూపిన చొరవ వారి ప్రాణాలను కాపాడింది.

హెయిర్ డ్రసర్ రాముకి గుండె జబ్బు వస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్షా అయిదు వేలు ఇప్పించారు. అలాగే స్వయంగా 30 వేలను సేకరించి ఆపరేషన్ చేయించారు ప్రభాకర్ రెడ్డి. ఉభయ గోదావరి




జిల్లాల్లో సంభవించిన తుఫాను బాధితుల సహాయార్థం రూ.50 వేలు విరాళం ఇచ్చారు. అంతటి ఉదార హృదయుడు ప్రభాకర్ రెడ్డి.

### కళాకారుల పరిచయం...

1972లో 'పండంటి కాపురం' సినిమా ద్వారా జయసుధను, 1975లో 'నాకూ స్వతంత్రం వచ్చింది' ద్వారా రచయిత గణేశ్ పాత్రోను, 1976లో 'భూమి కోసం' సినిమా ద్వారా జయప్రదను 1989లో 'శ్రీరామచంద్రుడు' సినిమా ద్వారా గీత రచయిత వెన్నెలకంటిని తెలుగు తెరకు ప్రభాకర్ రెడ్డి పరిచయం చేశారు. పండంటి కాపురం చిత్రం కోసం ప్రభాకర్‌రెడ్డి గోపి చేత పాట రాయించారు. అంతేకాదు తాను నటించిన, నిర్మించిన చిత్రాలకు ఎన్నో పాటలను గోపి చేత రాయించాడు ప్రభాకర్‌రెడ్డి.

### భక్తిచింతన...

ప్రభాకర్ రెడ్డి అమ్మవారి భక్తుడు. ప్రతి కార్తీక పౌర్ణమికి ఇంట్లో సత్యనారాయణ వ్రతం శివుడి పూజ చేయించేవారు. ప్రతి ఏటా అయ్యప్ప మాల వేసుకొని కఠిన నియమాలు పాటించేవారు.

### కుటుంబం...

ప్రభాకర్ రెడ్డి భార్య సంయుక్త మంచి అభిరుచి కలిగిన గృహిణి. భర్తకు అన్ని విధాలుగా సహకరించేవారు. కథలు డిస్కషన్ చేయడంలోనూ వివిధ భాషా చిత్రాలు చూసి ఆ పాత్రల గురించి చర్చిండంలోనూ, భర్త రచించిన పలు సినిమాల్లో నటీనటులకు కాస్ట్యూమ్ డిజైన్ చేయడంలోనూ తనదైన సహాయ సహకారాలు అందించేవారు. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలు. గంగ, శైలజ, లక్ష్మి, విశాలాక్షి గ్రామ దేవత గంగమ్మ తల్లిపేరు మీదుగా పెద్ద కూతురు గంగ పేరు పెట్టారు. మిగతా కూతుర్ల పేర్లు కూడా అమ్మవారిని ఉద్దేశించి పెట్టినవే.

కొడుకులు లేరన్న చింత ఆయనకు ఎప్పుడూ ఉండేది కాదు. కొడుకులైనా కూతుళ్లయినా నాకు ఒక్కటే అంటుండేవారు. సినీ పరిశ్రమలో రెండు పూటలా తిండి దొరక్క అలమటించే వృద్ధ కళాకారుల సంక్షేమం కోసం ప్రజాసేవ చేయాలని తలంచి నటనకు స్వస్తి చెప్పారు ప్రభాకర్ రెడ్డి.

### చిత్రపురిలో ప్రభాకర్ రెడ్డి విగ్రహం...

కోట్ల రూపాయల విలువైన తన సొంత భూమిని సినీ పరిశ్రమనే నమ్ముకొని పనిచేస్తున్న పేద కళాకారుల కోసం గొప్ప మానవతా హృదయంతో ఇచ్చిన ప్రభాకర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యుల సమక్షంలో విగ్రహావిష్కరణ చేశారు.

### శివైక్యం...

నటుడుగా, దర్శకుడిగా, నిర్మాతగా, కథా రచయితగా తెలుగు సినిమా రంగానికి తనదైన సేవల్ని అందించిన మందడి ప్రభాకర్ రెడ్డి 1997 నవంబర్ 26న తన 62వ ఏట అకస్మాత్తుగా కాలధర్మం చెందారు. వారు భౌతికంగా లేకపోయినా వారి సేవలు చిరస్మరణీయమైనవి. తెలుగు సినిమా వర్థిల్లినంత కాలం చిత్రపురిలో వారి పేరు వినిపిస్తూనే ఉంటుంది.

### సినిమా అనేది కళ ...

"సినిమా అనేది కళకాదు వ్యాపారమే" అనే వాళ్లున్నారు. "సినిమా అనేది వ్యాపారం కాదు కళే" అనేవాళ్ళు ఉన్నారు. ప్రభాకర్ రెడ్డి తొలిసారిగా నటించిన "చివరకు మిగిలేది" అనే సినిమా మంజీరా ఫిలిమ్స్ (ప్రై) లిమిటెడ్ పేరున 1960 అక్టోబర్‌లో విడుదలైంది. సగటు ప్రేక్షకునికి ఈ సినిమా అర్థం కాలేదు. ఇలాంటి సినిమా తీశారేంటి? అని ప్రేక్షకులు కోపగించుకున్నారు కూడా. దాంతో చాలా థియేటర్లలో ఒక వారం రోజుల్లోనే సినిమా తీసేశారు. అయితే హైదరాబాద్, కాకినాడ, విశాఖపట్నం కేంద్రాల్లో మాత్రం నాలుగు వారాలు ఆడింది. దీనికి కారణం అక్కడ వైద్య కళాశాలలు ఉండటం. విద్యార్థులు కొత్తదనాన్ని ఆహ్వానించడం. సబ్జెక్ట్ కూడా మెడికల్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఉండటం చేత ఈ మూడు కేంద్రాల్లో 30 రోజులు ఆడింది.

హైదరాబాద్‌లో సాగర్ సినిమా థియేటర్‌లో ఈ సినిమాను పి.వి.నంసింహారావు, భీంరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్)తో కలిసి చూశారు. పి.వి.నరసింహారావు చూసి ఇది మేధావులకు సంబంధించిన సినిమా అని వ్యాఖ్యానించారట.

ఏమైతేనేమి ఈ సినిమా ఆర్థికంగా అట్టర్ ఫ్లాప్ అయింది. అయితే మద్రాసులోని సౌత్ ఇండియా ఫిలిం జర్నలిస్టుల సంఘం ఈ సినిమాకు ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి, ఉత్తమ దర్శకత్వం అవార్డులను ప్రకటించింది. అది కొంత ఊరట. మొత్తం మీద ఇది ప్రయోగాత్మకమైన సినిమా అని తేలిపోయింది.

నూతన కథాంశంతో, భిన్న దృక్పథంతో, మంచి ఆశయాలతో మార్పును ఆశించి ఈ సినిమాను తీసినప్పటికీ అది ప్రజాదరణ పొందలేదు. సినిమా ఫెయిల్ కాగానే ఆర్థికంగా ఎంతో నష్టపోయారు.

దాంతో ఒకరోజు నిర్మాత పురుషోత్తం రెడ్డి ఇంట్లో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించుకోవడం జరిగింది. అప్పుడు పురుషోత్తంరెడ్డి "ఈ వ్యాపారం చేయడం నాతో కాదు" అని తేల్చి చెప్పేశారట. అటు యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్న పురుషోత్తం రెడ్డి సినిమారంగాన్ని పూర్తిగా వదులుకొని కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసేవారు.

ప్రభాకర్ రెడ్డి తొలిసారిగా నటించిన 'చివరకు మిగిలేది' వ్యాపారపరంగా విజయం పొందక పోవడంతో వెంటనే ఆయనకు మరో సినిమాలో అవకాశం రాలేదు. పెద్ద నటుడినైపోతాననుకున్న ప్రభాకర్ రెడ్డికి నిరాశే ఎదురైంది. హైదరాబాదులో ప్రాక్టీసు పెట్టుకుందామని తిరిగి వచ్చి ఆ పని చేశారు. కానీ ఇంతలో బి.ఎ.సుబ్బారావు "భీష్మ" (1962) హేమాంబరధరరావు "తండ్రులూ కొడుకులు" (1961) సినిమాల్లో వేషాలిచ్చి వెనక్కి పిలిపించారు. అలా ప్రభాకర్ రెడ్డికి సినిమా రంగంలో అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది.



1993 లో ఆలేరు సుమాంజలి సంస్థ జిల్లా స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో పున్నమికి వచ్చిన ప్రథమ బహుమతిని బహుకరిస్తున్న డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి.

## అనుబంధం - 1

**1. ఉమ్మడి కుటుంబం (22-10-1967)**

రామకృష్ణా యన్.ఏ.టి. కంబైన్స్ వారి "ఉమ్మడి కుటుంబం" 1967 ఏప్రిల్ 20న విడుదలైంది. ఈ సినిమాలో రేలంగి – సూర్యకాంతం, సత్యనారాయణ – వరలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి – సావిత్రి, నందమూరి తారక రామారావు – కృష్ణకుమారి ప్రధాన జంటలు. అల్లు రామలింగయ్య, నాగభూషణం, ముక్కామల, రాజబాబు, వాణిశ్రీ, రామచంద్రరావు, నాగరాజు, ఎల్.విజయలక్ష్మి, ఛాయాదేవి, హేమలత సహాయ పాత్రలు పోషించారు.

1968లో మాస్కోలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ చిత్రం ప్రదర్శితం కావడం విశేషం.

**2. మోసగాళ్లకు మోసగాడు (4-12-1971)**

శ్రీ పద్మాలయా మూవీస్ వారి 'మోసగాళ్ళకు మోసగాడు' తెలుగులో తొలి కౌబోయ్ చిత్రం. నటశేఖర కృష్ణ సమర్పణలో జి.ఆదిశేషగిరిరావు భారీ వ్యయంతో నిర్మించారు. కె.ఎస్.ఆర్.దాస్ దర్శకుడు. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలో కొంత షూటింగ్ జరిగింది. ఆరుద్ర కథను సమకూర్చారు. హాలీవుడ్ చిత్రం "మెకన్నాస్ గోల్డ్" చిత్రం నుండి స్ఫూర్తిని పొందారు. ఈ సినిమాకు తొలుత 'అదృష్ట రేఖ' అని పేరు పెట్టారు. ఆ తరువాత 'మోసగాళ్లకు మోసగాడు'గా మార్పు చేశారు. 1971 ఆగష్టు 27న విడుదలైన ఈ సినిమా కనకవర్షం కురిపించింది.

శోభన్‌బాబు, కృష్ణంరాజు, జగ్గయ్య, అంజలి, సావిత్రి, జమున, కాంచన, గీతాంజలి ప్రత్యేక అతిథులుగా హీరో కృష్ణ, విజయ నిర్మల, గుమ్మడి, నాగభూషణం, శాంతకుమారి, ప్రభాకర్ రెడ్డి, జ్యోతిలక్ష్మి తారాగణం. ఆదినారాయణరావు సంగీత దర్శకులు.

ఈ చిత్రం ప్రధాన భారతీయ భాషల్లోకి అనువాదమైంది. తమిళం, ఇంగ్లీషు, హిందీ భాషల్లో కూడా జయభేరి మ్రోగించింది.

**3. పండంటి కాపురం (28-10-1972)**

సూపర్‌స్టార్ కృష్ణ సమర్పణలో జయప్రద పిక్చర్స్ పతాకం వారి "పండంటి కాపురం" ఈస్ట్‌మన్ కలర్‌లో వెలువడింది. లక్ష్మీదీపక్ దర్శకత్వం వహించారు. నటుడు ప్రభాకర్ రెడ్డి కథను సమకూర్చారు. జి.హనుమంతరావు నిర్మాత. ఈ చిత్రం 1972 జూలై 21న విడుదలై ఘన విజయం సాధించింది. 17 కేంద్రాలలో వంద రోజులు ఆడింది. విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, రాజమండ్రి, తెనాలి కేంద్రాలలో నూరు రోజుల వేడుకలు వైభవంగా జరిగాయి. తెనాలిలో నిర్వహించిన ఉత్సవానికి శోభన్‌బాబు, గుంటూరుకు జగ్గయ్య, హైదరాబాద్‌కు అక్కినేని నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 1972 అక్టోబర్ 28న విజయవాడలోని ఊర్వశి ఏసి థియేటర్‌లో జరిగిన వేడుకలకు నటరత్న నందమూరి తారక రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నటీనటులు – హీరో కృష్ణ, విజయ నిర్మల, జమున, ప్రభాకర్ రెడ్డి, రాజబాబు, గుమ్మడి, రాధాకుమారిలు, జయసుధ, నరేష్‌లకు ఇది తొలిచిత్రం హీరో కృష్ణకు ఇదే మొదటి రజతోత్సవ చిత్రం, తొలి స్వర్ణోత్సవ చిత్రం కావడం విశేషం.

**4. దేశోద్ధారకులు (12-08-1973)**

దీప్తి ఇంటర్నేషనల్ వారి దేశోద్ధారకుడు అత్యుత్తమ కథాచిత్రం. సామాజిక సమస్యలను, అనమానతలను ఎలుగెత్తి చాటుతూ నిర్మాత యు.విశ్వేశ్వరరావు భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. నందమూరి తారకరామారావు, వాణిశ్రీ ప్రధాన పాత్రలు ధరించిన ఈ రంగుల సినిమాకు సి.ఎస్.రావు దర్శకుడు 1973 మార్చి 29న సినిమా విడుదలై ఘనవిజయం సాధించింది. అత్యధికంగా 210 రోజులు ఆడింది.

**నటీనటులు :** నాగభూషణం, నాగయ్య, ధూళిపాళ, మిక్కిలినేని, రాజనాల, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, రావుగోపాలరావు, పద్మనాభం, అల్లు రామలింగయ్య, ముక్కామల, రామచంద్రరావు, త్యాగరాజు, అర్జా జనార్ధనరావు, సి.హెచ్.కృష్ణమూర్తి, సావిత్రి, రాజసులోచన, శోభ, లక్ష్మీఛాయ, పద్మా ఖన్నా, అరుణాయి రానీ తదితరులు.

**5. నిప్పులాంటి మనిషి (05-02-1975)**

నటరత్న నందమూరి తారక రామారావు టైటిల్ పాత్రలో అపూర్వంగా నటించిన రవి చిత్ర ఫిలింస్ 'నిప్పులాంటి మనిషి' ఘన విజయం సాధించింది. హిందీ చిత్రం "జంజీర్" ఆధారంగా రూపొందిన చిత్రం. ఎన్.టి.ఆర్ ఖ్యాతిని ఇనుమడింపజేసింది. సత్యనారాయణ, లత, దేవిక, బాలాజీ, విజయశ్రీ, ప్రభాకర్ రెడ్డి, రాజబాబు, త్యాగరాజు, పెమ్మసాని రామకృష్ణ ప్రధాన తారాగణం. రేలంగి అతిథి పాత్రలో మెప్పించారు. ఆయనకదే ఆఖరి చిత్రం కావడం విశేషం. 1975 ఫిబ్రవరి 5న విజయవాడలో శతదినోత్సవ వేడుకల్ని ఘనంగా జరుపుకుంది.

**6. అల్లూరి సీతారామరాజు (01-05-1975)**

పద్మాలయా వారి 'అల్లూరి సీతారామరాజు' చిత్రం 1975 మే 1న హైదరాబాదులోని సంగం థియేటర్‌లో స్వర్ణోత్సవ వేడుకల్ని ఘనంగా జరుపుకుంది. హీరో కృష్ణ నటజీవితంలో మరపురాని చిత్రంగా నిలిచిపోయింది. ఈ సినిమాలో ప్రభాకర్ రెడ్డి (మల్లదొర) ఆవేశపూరితమైన పాత్ర నిర్వహించటం చెప్పుకోదగ్గ విశేషం.

**7. అన్నదమ్ముల అనుబంధం (21-10-1975)**

గజలక్ష్మి చిత్ర వారి భారీ వర్ణ చిత్రం. ఎన్.టి.రామారావు, మురళీమోహన్, నందమూరి బాలకృష్ణ అన్నదమ్ములుగా నటించారు. ఈ చిత్రానికి ఎన్.డి.లాల్ దర్శకత్వం వహించారు. హిందీలో అద్వితీయ విజయం సాధించిన 'యాదోంకీ భారాత్' ఆధారం. కాంచన, లత, జయమాలిని హీరోయిన్లు. ఎన్.టి.రామారావు, మురళీమోహన్, బాలకృష్ణ, గిరిబాబు, ప్రభాకర్ రెడ్డి, రాజబాబు, కాంచన, లత జయమాలిని నటీనటులు.




## డా॥ యం.ప్రభాకర్ రెడ్డి నటించిన సినిమాలు

1.చివరకు మిగిలేది (1960)
2.తండ్రులూ కొడుకులు (1961)
3.రక్త సంబంధం (1962)
4.దీక్ష (1974)
5.పునర్జన్మ (1963)
6.నర్తనశాల (1963)
7.బొబ్బిలి యుద్ధం (1964)
8.తోటలో పిల్ల-కోటలో రాణి (1964)
9.ఉయ్యాల జంపాల (1965)
10.ఆకాశ రామన్న (1965)
11.దొరికితే దొంగలు (1965)
12.పల్నాటి యుద్ధం (1966)
13.సరస్వతి శపథం (1966)
14.నవరాత్రి (1966)
15.ఆమె ఎవరు (1966)
16.కంచుకోట (1967)
17.మాతృదేవత (1967)
18.జగత్ కిలాడీలు (1967)
19.రక్త సింధూరం (1967)
20.ఉమ్మడి కుటుంబం (1967)
21.దేవకన్య (1968)
22.అగ్గిమీద గుగ్గిలం (1968)
23.రణభేరి (1968)
24 ఆత్మీయులు (1969)
25.భలే తమ్ముడు (1969)
26.మారిన మనిషి (1970)
27.రెండు కుటుంబాల కథ (1970)
28.అక్కాచెల్లెలు (1970)
29.మాస్టర్ కిలాడి (1971)
30.రౌడీలకు రౌడీలు (1971)
31.అనూరాధ (1971)
32.జగత్ జంత్రీలు (1971)
33.నమ్మక ద్రోహులు (1971)
34.రామాలయం (1971)
35.మొనగాళ్ళకు మొనగాడు (1971)
36.మట్టిలో మాణిక్యం (1971)
37.పండంటి కాపురం (1972)
38.పిల్లా.. పిడుగా (1972)
39.మావూరి మొనగాళ్ళు (1972)
40.కిల్లాడీ బుల్లోడు (1972)
41.నిజం నిరూపిస్తా (1972)
42.కన్నతల్లి (1972)
43.శభాష్ బుల్లెమ్మ (1972)
44.నిజరూపాలు (1972)
45.అమ్మ మాట (1972)
46.కూతురు – కోడలు (1972)
47.మంచివాళ్ళకు మంచివాడు (1973)
48.పద్మవ్యూహం (1973)
49.పాపం పసివాడు (1973)
50.ఒక నారి వంద తుపాకులు (1973)
51.దేశోద్ధారకులు (1973)
52.గాంధీ పుట్టిన దేశం (1973)
53.కన్నవారి కలలు (1974)
54.అందరూ దొంగలే (1974)
55.ఆడంబరాలు–అనుబంధాలు(1974)
56.దీర్ఘసుమంగళి (1974)
57.అల్లూరి సీతారామరాజు (1975)
58 నిప్పులాంటి మనిషి (1975)
59.నాకూ స్వతంత్రం వచ్చింది (1975)
60.రెండు కుటుంబాల కథ (1975)
61.తీర్పు (1975)
62.కథానాయకుని కథ (1975)
63.అన్నదమ్ముల అనుబంధం (1975)
64.బలిపీఠం (1975)
65.తోటరాముడు (1975)
66.ఆరాధన (1976)
67.నేరం నాది కాదు ఆకలిది (1976)
68.ఎదురులేని మనిషి (1976)
69.భూమి కోసం (1976)
70.భక్త కన్నప్ప (1976)
71.పాడి పంటలు (1976)
72.నా పేరే భగవాన్ (1976)
73.రామరాజ్యంలో రక్తపాశం (1976)
74.చిల్లర దేవుళ్ళు (1976)
75.కల్పన (1977)
76.ఈ కాలపు పిల్లలు (1977)
77.ఖైదీ కాళిదాసు (1977)
78.ఇంద్రధనుస్సు (1977)
79.మార్పు (1977)
80.యుగపురుషుడు (1978)
81.దేవదాసు మళ్లీ పుట్టాడు (1978)
82.అమర దీపం (1978)
83.ఇల్లాలి ముచ్చట్లు (1978)
84.సంఘం మారాలి (1979)
85.యుగంధర్ (1979)
86.కార్తీక దీపం (1979)
87.రంగూన్ రౌడీ (1979)
88.శృంగార రాముడు (1979)
89.శివకేశవులు (1979)
90.నకిలీ మనిషి (1980)
91.శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి మహత్యం (1980)
92.రాముడు-పరశురాముడు (1980)
93.గోరింటాకు (1980)
94.గురు (1980)
95.యువతరం కదిలింది (1980)
96.శివమెత్తిన సత్యం (1980)
97.హరిశ్చంద్రుడు (1981)
98.పల్లె పిలిచింది (1981)
99.జగమొండి (1981)
100.జేగంటలు (1981)
101.గువ్వల జంట (1981)
102.సంసారం-సంతానం (1981)
103.హరిశ్చంద్రుడు (1981)
104.జతగాడు (1981)
105.అద్దాల మేడ (1981)
106.చట్టానికి కళ్ళులేవు (1981)
107.గృహప్రవేశం (1982)
108.ప్రతిజ్ఞ (1982)
109.మధుర స్వప్నం (1982)
110.కలహాల కాపురం (1982)
111.ఇది పెళ్ళంటారా? (1982)
112.చలాకీ చెల్లెమ్మ (1982)
113.షంషేర్ శంకర్ (1982)
114.యువరాజు (1982)
115.రాముడు కాదు కృష్ణుడు (1982)
116.మాయగాడు (1982)
117.ఆయన కలియుగ దైవం (1983)
118.సంఘర్షణ (1983)
119.కుంకుమ తిలకం (1983)
120.ముందడుగు (1983)
121.రాముడు కాదు కృష్ణుడు (1983)
122.ధర్మాత్ముడు (1983)
123.శక్తి (1983)
124.అనుబంధం (1984)
125.ఉగ్రరూపం (1984)
126.గృహలక్ష్మి (1984)
127.దొంగలు బాబోయ్‌దొంగలు (1984)
128.ఓ తండ్రి తీర్పు (1985)
129.న్యాయం మీరే చెప్పాలి (1985)
130.మాంగళ్య బలం (1985)
131.గర్జన (1985)
132.కుటుంబ బంధం (1985)
133.జీవనరాగం (1985)
134.పాపికొండలు (1985)
135.విజృంభణ (1985)
136.ప్రతిభావంతుడు (1986)
137.శ్రీదత్త దర్శనం (1986)
138.మండలాధీశుడు (1987)
139.లాయర్ సుహాసిని (1987)
140.ప్రచండ భారతం (1988)
141.ఊరేగింపు (1988)
142.బజారు రౌడీ (1988)
143 గండిపేట రహస్యం (1989)
144.ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ (1989)
145.రిక్షావాలా (1989)
146.టూ టౌన్ రౌడీ (1989)
147.ప్రజల మనిషి (1989)
148.బాలచంద్రుడు (1989)
149.చిన్న కోడలు (1990)
150.కొడుకులుదిద్దిన కాపురం (1990)
151.రక్త తర్పణం (1990)
152.పచ్చని సంసారం (1993)
153.కామ్రేడ్ (1996)
154.పాండవ వనవాసం
155.శ్రీకృష్ణ పాండవీయం
156.దానవీర శూరకర్ణ
157.శ్రీమద్విరాట పర్వం
158.మహామంత్రి తిమ్మరుసు
159.వీరభద్ర గణపతి
160.అగ్ని కిరీటం
161.లక్ష్మీ కటాక్షం
162.పలుకే బంగారం
163.మోసగాళ్ళకు మోసగాడు
164.ఏడంతస్తుల మేడ
165.గండికోట రహస్యం
166.విక్రమార్క విజయం
167.సింహాసనం
168.మాయదారి మల్లిగాడు
169.అన్నా చెల్లెలు
170.అంతిమ తీర్పు
171.పెత్తందార్లు
172.ఆడంబరాలు–అనుబంధాలు
173.కలియుగదైవం
174.శ్రీకృష్ణావతారం
175. కళ్యాణతిలకం
176. శ్రీకృష్ణార్జున యుద్ధం
177.బందిపోటు దొంగలు
178.బ్రహ్మచారి
179.శ్రీకృష్ణ విజయం

డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి

### నటించిన హిందీ చిత్రాలు

1.హిమ్మత్
2.మాంగ్ భరో సుజనా
3.మేరా సాథీ
4.హిమ్మత్ ఔర్ మెహనత్
5.వక్త్‌కా పెషన్ షా

**8. బలిపీఠం (26-10-1975)**

దర్శకరత్న దాసరి నారాయణరావు, నటభూషణం శోభన్ బాబు కలయికతో వెలువడిన తొలి చిత్రం విఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మ కలం నుండి జాలువారిన నవలను దర్శకుడు దాసరి నారాయణరావు అదే పేరుతో తెరకెక్కించారు. 1975 జూలై 17న విడుదలైన బలిపీఠం సామాజిక చిత్రంగా పేరు పొందింది. మహిళల అఖండాదరణ తో విజయ యాత్ర చేసింది. ఈ చిత్రంలో వర్ణాంతర వివాహాలు కారణంగా ఎదురయ్యే సమస్యలను సమగ్రంగా చర్చించారు. ఈ సినిమా లో శోభన్ బాబు, శారద ప్రధాన జంట. అల్లు రామలింగయ్య, రాజబాబు, కొమ్మినేని శేషగిరిరావు, మోతుకూరి సత్యం. మాస్టర్ రేలంగి, రోజారమణి, నిమ్మల, హేమలత, గిరిజారాణి యితర పాత్రల్లో కనిపిస్తారు. షావుకారు జానకి, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, ముక్కామల, మురళీ మోహన్, గిరిజ, సంగీత దర్శకుడు చక్రవర్తి అతిథి పాత్రల్లో కనిపిస్తారు.

**భక్త కన్నప్ప (05-09-1976)**

ముక్కంటి దేవరకు కనువిందు చేసిన తిన్నడి కథే 'కన్నప్ప' యితివృత్తం. గోపీ కృష్ణా మూవీస్ బ్యానర్‌పై యు.సూర్యనారాయణరాజు భారీ వ్యయంతో నిర్మించారు. దర్శకుడు బాపు తనదైన శైలిలో రమణీయ దృశ్యకావ్యంగా తీర్చిదిద్దారు. కృష్ణంరాజు, వాణిశ్రీ ప్రధాన పాత్రలు ధరించిన ఈ సినిమా 1976 మే 29న విడుదలై ఘన విజయం సాధించింది. 1976 సెప్టెంబర్ 5న మద్రాసులో విజయోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సినిమా 200 రోజులు ఆడింది. ఇందులో కృష్ణంరాజు, బాలయ్య, సారధి, రావుగోపాలరావు, శ్రీధర్ అల్లురామలింగయ్య, ప్రభాకర్ రెడ్డి ప్రధాన పాత్రలు ధరించారు.

**11. నేరం నాది కాదు ఆకలిది (29-10-1976)**

ఎన్.టి.ఆర్. సమర్పణలో రవి చిత్ర ఫిలింస్ అందించిన ఈ చిత్రం 1976 జూలై 22న విడుదలై మంచి ఆర్థికంగా చక్కని విజయం సాధించింది. 9 కేంద్రాల్లో వంద రోజులు ఆడింది. ఈ సినిమాలో ఎన్.టి.రామారావు మంజుల ప్రధాన జంట. ఎస్.డి.లాల్ దర్శకుడు. రాజేష్ ఖన్నా, ముంతాజ్ ప్రధాన పాత్రలు. 'హిందీ'లో రూపొంది విజయవంతమైన 'రోటీ' మాతృక. రచయిత గొల్లపూడి మారుతీరావు తెలుగు వాతావరణానికి అనుగుణంగా కథలకు మార్పులు చేశారు. ఈ సినిమాలో గుమ్మడి, పండరీబాయి కరుణ పూరిత పాత్రల్లో జీవించారు. ప్రభ, జయమాలిని, టి.జి.కమలాదేవి, రాజబాబు, కాంతారావు, గిరిబాబు, ప్రభాకర్ రెడ్డి, పద్మనాభం, మురళీమోహన్, అల్లు రామలింగయ్య తదితరులు నటించారు.



స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించిన చిత్రం
**'గాంధీ పుట్టిన దేశం'**

**12. అమరదీపం (21-03-1978)**

హీరో కృష్ణంరాజు గోపీకృష్ణ మూవీస్ పతాకంపై నిర్మించబడిన ఈ సినిమాలో కృష్ణంరాజు, జయసుధ, మాధవి ప్రధాన తారాగణం. ఉదాత్తమైన కథాంశంతో అత్యున్నత విలువలతో నిర్మించిన ఈ చిత్రానికి దర్శకుడు కె.రాఘవేంద్రరావు. తను ప్రేమించిన వారికోసం తన ప్రేమను, కుటుంబం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పాత్రలో కృష్ణంరాజు జీవించాడు. ఈ చిత్రంలో ప్రభాకర్ రెడ్డి, సారధి, సాక్షి రంగారావు, మాడా, పొట్టి ప్రసాద్, మాస్టర్ రాజు, సత్యనారాయణ, రమాప్రభ, జయమాలిని, అపర్ణ, విజయలక్ష్మి తారాగణం.

**13. కార్తీక దీపం (17-08-1979)**

అందాల నటుడు శోభన్ బాబు, శారద, శ్రీదేవి ప్రధాన పాత్రల్లో కవితా మూవీస్ నిర్మించిన పంచరంగుల చిత్రం ఇది. 1979 మే 10న విడుదలైంది. మహిళల ఆదరణను విశేషంగా చూరగొన్నది. 12 కేంద్రాలలో విజయవంతంగా వంద రోజులు ఆడింది. ఆగస్టు 17వ తేదీన విజయవాడ కళ్యాణ చక్రవర్తి థియేటర్‌లో శతదినోత్సవ సంబరాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఎన్.టి.రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో హీరో శోభన్ బాబు, శారద, అల్లు రామలింగయ్య, రాజబాబు, గీత, ప్రభాకర్ రెడ్డి, రమాప్రభ, మాడా తదితరులు నటించారు. లక్ష్మీదీపక్ దర్శకులు. ఈ సినిమా 200 రోజులు ఆడింది.

**14. గోరింటాకు (23-02-1980)**

దాసరి నారాయణరావు దర్శకత్వంలో యువచిత్ర నిర్మించిన ఈ చిత్రం 1979 అక్టోబర్ 11న విడుదలైంది. మహిళల అపూర్వ ఆదరణతో విజయభేరి మ్రోగించింది. శోభన్ బాబు, సుజాత, వక్కలంక పద్మ, సావిత్రి ప్రధాన పాత్రలు ధరించిన ఈ సినిమా 125 రోజుల వేడుకలు ఘనంగా జరిగాయి. కె.వి.మహదేవన్ సంగీత దర్శకులు. ఇందులో శోభన్‌బాబు, సుజాత, ప్రభాకర్ రెడ్డి తదితరులు నటించారు.

**15.గృహప్రవేశం (10-10-1982)**

డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి సమర్పణలో శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్ పిక్చర్స్ నిర్మించిన ఉత్తమ కథాచిత్రం. అనూహ్యమైన విజయం సాధించిన ఈ సినిమాలో మోహన్‌బాబు, జయసుధ జంటగా నటించారు. చిత్ర నిర్మాత యడవెల్లి విజయేందర్ రెడ్డి.

1982 అక్టోబర్ 1వ తేదీన మద్రాసులోని సవేరా హోటల్‌లో రజతోత్సవ వేడుకలను నిరాడంబరంగా జరుపుకుంది. హీరో కృష్ణ అధ్యక్షత వహించారు. హీరో కృష్ణంరాజు, గుమ్మడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నటి దర్శకురాలు విజయ నిర్మల, శాయికృష్ణ ఫిలింస్ అధినేత కె.కేశవరావు. నిర్మాత వడ్డే రమేష్, కళ్యాణి ఫిలింస్ సుధాకర్ రెడ్డి చిత్రకథానాయకి జయసుధ తదితరులు ప్రసంగించారు. దర్శకుడు బి.భాస్కర్ దీక్షా దక్షతల కారణంగానే సినిమా ఘన విజయం సాధించిందని హీరో కృష్ణ తన ప్రసంగంలో విశ్లేషించారు.

**16. చట్టానికి కళ్ళు లేవు (06-02-1982)**

శ్రీకర ప్రొడక్షన్స్ వారి 'చట్టానికి కళ్ళు లేవు' వినూత్న కథాంశంతో నిర్మితమైంది. ఫ్యామిలీ సెంటిమెంట్‌ను మిళితం చేశారు. లక్ష్మి, చిరంజీవి అక్కా తమ్ముళ్ళుగా నటించిన ఈ సినిమాలో మాధవి కథానాయిక. రమణమూర్తి, హేమ సుందర్, కన్నడ ప్రభాకర్, సిలోన్ మనోహర్, నారాయణరావు, రావి కొండలరావు, మాడా, సారధి, నీలిమ, ప్రభాకర్ రెడ్డి, బేబీ వరలక్ష్మి, పి.జె.శర్మ, మల్లాది ధమ్, పండరీ బాయి, జయశీల తదితరులు నటించారు.

**17. ప్రతిజ్ఞ (10-10-1982)**

శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు నిర్మించిన తొలి చిత్రం 1982 జూలై 1న విడుదలైంది. ఇందులో మోహన్‌బాబు, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, మాస్టర్ విష్ణువర్ధన్‌బాబు నటీనటులు. దర్శకుడు బోయిన సుబ్బారావు.

**18. రాముడు కాదు కృష్ణుడు (03-07-1983)**

లక్ష్మీ ఫిలిమ్స్ కంబైన్స్ 'రాముడు కాదు కృష్ణుడు'లో అక్కినేని నాగేశ్వరరావు ద్విపాత్రాభినయం చేశారు. జయసుధ, రాధిక నాయికలు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించారు. 1983 మార్చి 25న విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. ఇందులో రావుగోపాలరావు, గిరిబాబు, ప్రభాకర్ రెడ్డి, అశోక్ కుమార్, సత్యేంద్ర కుమార్, రాజసులోచన, సూర్యకాంతం, జయమాలిని, మమత, సుకుమారి, జయంతి నటీనటులు.

**19. ముందడుగు (28-08-1983)**

కృష్ణ, జయప్రద, శోభన్ బాబు, శ్రీదేవి ప్రధాన జంటలుగా సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం 1983 ఫిబ్రవరి 25న విడుదలైంది. 18 కేంద్రాలలో నూరు రోజుల పండుగ చేసుకుంది.

గుమ్మడి, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, శోభన్ బాబులతో పాటు కృష్ణంరాజు, మురళీ మోహన్, చిరంజీవి 8 మంది హీరోయిన్లు శ్రీదేవి, జయప్రద, జయసుధ, సుమలత, మాధవి, ప్రభ, నళిని, దీపలు– చిత్ర దర్శకుడు కె.బాపయ్య.

**20. శక్తి (11-12-1983)**

గోపీ మూవీస్ 'శక్తి'లో హీరో కృష్ణ ద్విపాత్రాభినయం చేశారు. జయసుధ, రాధ హీరోయిన్లు. కృష్ణ సరసన రాధ నటించడం ఇదే తొలిసారి. కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించారు. ఈ సినిమా 1983 సెప్టెంబర్ 2న విడుదలైంది. ఇందులో రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య, ప్రభాకర్ రెడ్డి, గిరిబాబు, కాంతారావు, మాడా, చలపతిరావు, శోభ, నిర్మల, అన్నపూర్ణ కీలక పాత్రలు పోషించారు.

**21.ధర్మాత్ముడు (24-12-1983)**

డా॥ యం.ప్రభాకర్ రెడ్డి సమర్పణలో శ్రీ భ్రమరాంబికా ఫిలింస్ బ్యానర్‌పై కె.కేశవరావు నిర్మించిన చక్కని కథా చిత్రం. ఘనవిజయం సాధించిన ఈ సినిమాలో హీరో కృష్ణంరాజు నటజీవితంలో మేలిమి చిత్రంగా నిలిచింది. బి.భాస్కరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జయసుధ కథానాయిక. 1983 సెప్టెంబర్ 16న విడుదలైన ఈ సినిమా అన్నివర్గాల ఆదరణ చూరగొన్నది. గుమ్మడి, మిక్కిలినేని, ప్రసాద్ బాబు, రాజేష్, త్యాగరాజు, చలపతిరావు, భీమరాజు, ఆనంద మోహన్, జయసుధ, విజయశాంతి, అత్తిలి లక్ష్మి తారాగణం. ఈ సినిమాకు డా॥ఎం.ప్రభాకర్ రెడ్డి కథను సమకూర్చారు. డిసెంబర్ 24 నాటికి 14 కేంద్రాలలో వంద రోజుల ప్రదర్శన పూర్తి చేసుకుంది.

**22. శ్రీదత్త దర్శనము (27-04-1986)**

శ్రీ దత్త సచ్చిదానంద ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా 1986 ఏప్రిల్ 27న మద్రాసులోని దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆడిటోరియంలో శతదినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంది. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ హాజరైన ఈ సంబరాలకు ఆయన భక్తులు భారీగా విచ్చేశారు. ఇందులో సర్వదమన్ బెనర్జీ, శివకృష్ణ, రంగనాథ్, గుమ్మడి, ప్రభాకర్ రెడ్డి, ఆర్.విజయ, మంజు భార్గవి, జయంతి, కాంచన, ప్రభ, జ్యోతిర్మయి ప్రధాన పాత్రధారలు.

**23. కొడుకు దిద్దిన కాపురం (28-01-1990)**

పద్మాలయా స్టూడియో నిర్మించిన ఈ చిత్రం 1990 జనవరి 28న విడుదలై ఘన విజయం సాధించింది. నిర్మాత ఎం.ఎస్.రెడ్డి, హీరో కృష్ణ, మహేష్‌బాబు, విజయ నిర్మల, గుమ్మడి, యు.సూర్యనారాయణ బాబు, ప్రభాకర్ రెడ్డి తారాగణం.

**24. వచ్చని సంసారం (03-05-1993)**

హీరో కృష్ణ, ఆమని ప్రధాన పాత్రలో పామర్స్ ఫిలింస్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం 1993 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదలైంది. ఆర్థిక విజయం సాధించింది. హీరో కృష్ణకు పూర్వ వైభవం ప్రసాదించింది. 1993 మే 3న హైదరాబాద్‌లోని భాస్కర ప్యాలెస్‌లో శతదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

**25. ఎదురులేని మనిషి (20-03-1976)**

చలసాని అశ్వనీదత్ 1975లో నిర్మాతగా మారారు. వైజయంతీ మూవీస్ పేరిట సొంత నిర్మాణ సంస్థను నెలకొల్పారు. తొలి ప్రయత్నంగా "ఎదురులేని మనిషి" నిర్మించారు. హిందీలో విజయవంతమైన "జానీ మేరా నామ్" మాతృక.

ఇందులో ఎన్.టి.రామారావు, వాణిశ్రీ, జగ్గయ్య, ముఖ్య పాత్రధారులు. కె.బాపయ్య దర్శకులు. 1975 డిసెంబర్ 12న సినిమా విడుదలై అద్వితీయ విజయాన్ని అందుకుంది. ఇందులో అల్లు రామలింగయ్య, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ, పద్మప్రియ, నిర్మల, గిరిజారాణి, శశిరేఖ, నాగశ్రీ, డా॥రమేష్, ఆనంద మోహన్, భీమరాజు, నందూరి సుబ్బారావు, ఎ.బి.ఆనంద్, కోళ్ళ సత్యం, మాస్టర్ రాము, మాస్టర్ బాబుల్ ఇతర

(4వ పేజీ తరువాయి...)



ప్రభాకర్ రెడ్డి తండ్రిగారి వర్ధంతి రోజున తుంగతుర్తిలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రభాకర్ రెడ్డి గారికి పూలమాల వేస్తున్న అంతటి యాదగిరి.



పాత్రలు పోషించారు. ఈ సినిమా ఎన్.టి.రామారావుకు సరికొత్త మాస్ ఇమేజ్ ప్రసాదించింది.

**26. పాపం పసివాడు (01-01-1973)**

శ్రీలక్ష్మీ ప్రొడక్షన్స్ వారి పంచ రంగుల చిత్రం 'పాపం పసివాడు' చక్కని ప్రజాధరణ పొందింది. అన్ని వర్గాల వారిని అలరించింది. 1969లో వచ్చిన దక్షిణాఫ్రికా చిత్రం "లాస్ట్ ఇన్ ది డిసర్ట్" ఈ సినిమాకు మూలాధారం. రచయిత గొల్లపూడి మారుతీరావు మాతృకలో సమూల మార్పులు చేశారు. కుటుంబ నేపథ్యాన్ని సమకూర్చారు. రసవత్తరమైన సంభాషణలు అందించారు. బాల నటుడు మాస్టర్ రాము టైటిల్ పాత్రకు పూర్తి న్యాయం చేశాడు. ఈ సినిమా 1972 సెప్టెంబర్‌లో విడుదలైంది. అన్ని ముఖ్య కేంద్రాలలో వంద రోజులు ఆడింది. 1973 జనవరి 1న మద్రాసు న్యూ ఉడ్‌లాండ్స్ హోటల్‌లో శతదినోత్సవ సంబరాలు ఆహ్లాద భరితంగా జరిగాయి.

ఈ సినిమాలో ప్రభాకర్ రెడ్డి, నాగయ్య, త్యాగరాజు, రాజబాబు, ఆనంద మోహన్, డాక్టర్ రమేష్, మాస్టర్ విశ్వేశ్వరరావు, వల్లం నరసింహారావు, ఛాయాదేవి, నాగశ్రీ తారాగణం.

**27. ప్రేమాభిషేకం (18-02-1981)**

అన్నపూర్ణ స్టూడియోస్ వారి "ప్రేమాభిషేకం" 1981 ఫిబ్రవరి 18న విడుదలై చారిత్రక విజయం సాధించింది. తెలుగు చిత్ర జగతిలో ప్రత్యేక స్థానం పొందింది. విజయోత్సవాల విషయాలు సైతం ప్రేమాభిషేకందే అగ్రాసనం. 1981 జూన్ 14న విజయవాడలో వంద రోజుల పండుగ జరిగింది. ఆగస్టు 9న హైదరాబాద్‌లో రజతోత్సవ వేడుకలు కనువిందుగా నిర్వహించారు. అదే ఏడాది డిసెంబర్ 14న నెల్లూరులో త్రిశత దినోత్సవం జరిపారు. 1982




ఫిబ్రవరి 28న మద్రాసులో స్వర్ణోత్సవ సంబరాలు రంగరంగ వైభవంగా జరిగాయి.

ఈ సినిమాలో ప్రభాకర్ రెడ్డి ఓ సన్నివేశాన్ని సెంటిమెంటల్‌గా రక్తి కట్టించారు.

"పిల్లలు పుట్టకపోతే తల్లి బాధ పడుతుంది. పుట్టిన పిల్లలు ప్రయోజకులు కాకపోతే తండ్రి బాధపడతాడు. పిల్లలు పుట్టినా పుట్టకపోయినా బాధపడేది తల్లిదండ్రు లేనమ్మా".

**ప్రతిభావంతుడు**

Everytime you spoke to me there was a little silence in between your words. I understood what you did not say....Now you are gone "Father" leaving the silence behind

And

I can still hear your speak to me

(నాన్నా... నువ్ నాతో మాట్లాడిన ప్రతిసారీ నీ మాటల మధ్య నిశ్శబ్దం... నువ్ చెప్పడానికి వెనకాడే విషయాలను తెలిపేవి... ఇప్పుడు నువ్ లేవు... కానీ ఆ నిశ్శబ్దంలో నువ్వు మా వెన్నంటే ఉన్నావ్! ఆ నిశ్శబ్దంలోని నీ మాటలను నేను ఇప్పటికీ వింటున్నాను...)

ఇవి చాలు కదా... ఆ బిడ్డ నాన్నను ఎంతగా ప్రేమిస్తుందో చెప్పడానికి!

ఆ నాన్న... సున్నిత మనస్కుడు... కథకుడు... దృశ్యాలకు రూపమిచ్చే దర్శకుడు... డాక్టర్ మందడి ప్రభాకర్ రెడ్డి! పైన తన మనసుకు అక్షరాలను అల్లిన ఆ బిడ్డ శైలజ! ఆయన రెండో కూతురు!

తండ్రి రక్తాన్నే కాదు వారసత్వంగా భావుకతను, సృజనాత్మకతనూ ఆమె పంచుకుంది అని చెప్పడానికి ఆ కవిత చాలు!

ప్రభాకర్ రెడ్డికి ఒక్క కూతురే కాదు నలుగురు కూతుళ్లూ ఆయన ఆస్తిని కాదు ఆలోచనలను, ఆశయాలను... వారసత్వంగా పంచుకున్నారు. ఆయన జ్ఞాపకాలను ఓ పెన్నిధిలా దాచుకున్నారు. మందడి ప్రభాకర్ రెడ్డి పరంపర సాగిస్తున్న ఆయన సతీమణి సంయుక్త. తనయలు శైలజ, లక్ష్మీ, డాక్టర్ విశాలాక్షిలతో ఈ సిల్ సిలా....

2007... హైటెక్స్... తెలుగు సినిమా వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్న సందర్భం!

అప్పటికే ప్రభాకర్ రెడ్డి చనిపోయి పదకొండేళ్లు అవుతోంది. వజ్రోత్సవాల వేదిక మీద సినిమా అతిరథ మహారథులంతా ఆసీనులయ్యారు. సినీ కళాసేవలో కీర్తిశేషులైన ఎందరో మహానుభావులను పేరు పేరున తలచుకుంటూ ఉత్సవాలను ప్రారంభించారు. అందరినీ కొనియాడుతూ వేడుకలను ముగించారు. ఇంత సంబరంలో ఈ ఇండస్ట్రీకి అజాతశత్రువైన ప్రభాకర్ రెడ్డి పేరును మరిచారు. ఒక్క మోహన్‌బాబుకు తప్ప ఆ ఆత్మీయుడు ఎవరికీ జ్ఞాపకం లేదు. అది యాదృచ్ఛికమా... అలక్ష్యమా... ఇప్పుడున్న సినీ పెద్దలకే వదిలేద్దాం! కానీ ప్రభాకర్ రెడ్డి... నిర్లక్ష్యం చేయగల చిన్న మనిషి కాదు!

సినిమా పరిశ్రమలో లైట్ బాయ్ నుంచి నిర్మాత దాకా అందరూ గుర్తుంచుకోవాల్సిన పెద్ద మనిషి! అందుకే ఆ రోజు ఆ వేడుకల్లో తన భర్త పేరును అందరూ గుర్తు చేసుకుంటారని, తమ తండ్రిని అందరూ తలచుకుంటారని ఆశతో చూసిన ఆ కుటుంబం కళ్లు చిన్నబోయాయి. తల్లీ బిడ్డల మనసులు చివుక్కుమన్నాయి.

అసలు ప్రభాకర్ రెడ్డిని ఎందుకు సంస్మరించుకోవాలి? ఆయన ఉస్మానియాలో హౌస్ సర్జన్‌గా ఉన్నప్పుడు కాలేజ్ ఫంక్షన్‌లో ఓ నాటకం వేశాడు. అది చూసి పురుషోత్తం రెడ్డి చెన్నై పిలిపించారు. "నీలో మంచి ఈజ్ ఉంది. సినిమాలకు బావుంటావు" అని వెళ్ళడమే! ఇక ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసుకోలేదు. చివరకు మిగిలేది మొదలు 471 సినిమాల్లో నటించాడు. పండంటి కాపురం, వచ్చిన సంసారం, ధర్మాత్ముడు, గృహప్రవేశం, కార్తీక దీపం, గాంధీ పుట్టిన దేశం, నాకూ స్వతంత్ర్యం వచ్చింది లాంటి సినిమాలకు కథలను కూర్చాడు. మాటలు రాశాడు. జాతీయ అవార్డు (పండంటి కాపురం) నుంచి నంది అవార్డు దాకా పలు పురస్కారాలను పొందాడు. ఇది ఆయన సినిమా ప్రస్థానం. ప్రభాకర్ రెడ్డి ప్రయాణం ఇంతే అయితే ఇంత ఉపోద్ఘాతం అవసరమే లేదు.

**ఆఫ్ స్క్రీన్...**

ఆన్ స్క్రీన్‌లో నటన అంటే ఎంత ఇష్టమో... ఆఫ్ స్క్రీన్‌లో కథ, మాటలు, దర్శకత్వమే కాదు సినీ కార్మికుల కష్టాలు పట్టించుకోవడమూ ఆసక్తే! అందుకే సినిమా పెద్దల కోసం కాకుండా కార్మికుల కోసం... సినిమాల్లో అవకాశాలున్నా లేకపోయినా తల దాచుకోడానికైతే వాళ్లకు ఓ గూడు కావాలన్న ఆరాటంతో మణికొండలో చిత్రపురి కాలనీకి పునాది వేశాడు. సినిమాల మీద మోజుతో ఇంట్లోంచి పారిపోయి వచ్చే సినిమా పిచ్చోళ్లు చేతిలో డబ్బు కరిగిపోయాక ఈ మహానగరంలో (హైదరాబాద్) ఆకలికి అలమటించగూడదన్న ఆలోచనతో "ట్విన్ సిటీస్" క్లబ్‌కు తలుపులు తెరిచాడు. అది రోజుకు 300 మందికైనా అన్నం పెట్టి ఆదుకునేది. క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రిటైరైన వృద్ధులకోసమూ అది పనిచేసింది. ఆర్టిస్టుల భీమాకు భీముడిలా బలమందించాడు. ఇండస్ట్రీలోని ఏ కార్మికుడు ఏ చిన్న సమస్యను ఎదుర్కొంటున్నా పరిష్కారానికి పెద్ద మనసు చూపించే వాడు. ఎవరితో ఏ గొడవ లేకుండా చిన్నా పెద్ద అందరితో ఇట్టే కలిసిపోయేవాడు. అందుకే సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ దాకా అందరికీ ఆయనంటే అమితాభిమానం. డా॥ యం.మోహన్ బాబుకైతే ప్రభాకర్ రెడ్డి అంటే ప్రాణం. ఆయనను గురుతుల్యుడిగా భావిస్తాడు. కాబట్టేనేమో ప్రభాకర్ రెడ్డి పిల్లలను "మీ నాన్న చేసిన మంచి పనులే మీకు శ్రీరామరక్ష" అంటూ దీవిస్తాడు. ఆ పిల్లల మంచి చెడులను చూస్తుంటాడు. అదంతా నాన్న మీద మోహన్‌బాబు అంకుల్‌కున్న గౌరవం.




అభిమానం అని ఆ పిల్లలూ మోహన్ బాబును తమ పెద్ద దిక్కులా భావిస్తారు.

వజ్రోత్సవాల్లో పెద్దలు ప్రభాకర్ రెడ్డిని మరిచిపోయినా... ట్విన్ సిటీస్ క్లబ్ సహా ఆయన మొదలుపెట్టిన కొన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించ చకపోయినా ఆయన పిల్లర్‌లా నిలిచిన చిత్రపురి కాలనీ మాత్రం ప్రభాకర్ రెడ్డి పేరు పెట్టి కొంతైనా గౌరవాన్ని నిలుపుకుంది ఇండస్ట్రీ. ఇదీ ఆయన ఆఫ్ స్క్రీన్ లైఫ్‌లో కొంత భాగం! ఆ మాటకొస్తే అదెప్పుడూ శేషమే.

**కాస్ట్యూమ్ డిజైనర్**

ప్రభాకర్ రెడ్డిది పెద్దలు కుదిర్చిన వివాహమే. ఆయన మెడిసిన్ చదువుతున్నప్పుడే సంయుక్తతో పెళ్లయింది. డాక్టర్ పట్టా పుచ్చుకున్నా ఏనాడూ ప్రాక్టీస్ చేయలేదు. ఆయనేమో బాగా చదువుకున్నవాడు. భార్యకేమో పెద్దగా చదువులేదు. అచ్చు తన సినిమా కథలాగే మొదలైంది ఆయన వైవాహిక జీవితం కూడా. అయితే రీల్ లైఫ్‌లోని పురుషాధిక్యం ఆయన రియల్ లైఫ్‌లో ఎప్పుడూ చూపలేదు. భార్య ఆలోచనలనూ గౌరవించాడు. సినిమా కథలను సంయుక్తను కూర్చోబెట్టుకుని మరీ డిస్కస్ చేసేవాడు. స్వతహాగా ప్రభాకర్ రెడ్డికి పుస్తకాలంటే బాగా ఇష్టం. షూటింగ్‌లో ఉన్నా ఇంట్లో ఉన్నా పొద్దున్నే న్యూస్ పేపర్ చదవందే ఆయనకు గుడ్‌మార్నింగ్ అయ్యేది కాదు. ఇంగ్లీష్ డిక్షనరీని బాగా ప్రేమించేవాడు. రోజుకు 20 కొత్త పదాలు నేర్చుకుంటేనే ఆయనకు గుడ్ నైట్! సహజీవనంలో ప్రభాకర్ రెడ్డితో ఇవన్నీ ఇష్టంగా అలవర్చుకుంది సంయుక్త. ఆమె కోసం బెంగాల్ నుంచి నవలలను తెప్పించేవాడు. ఆయన చదివి తనకు నచ్చిన పాయింట్లను భర్తతో చర్చించేది. ఆమె సజెస్ట్ చేసిన సన్నివేశాలను తన సినిమా కథల్లో చేర్చేవాడు. అంతేకాదు తన సినిమాల్లో హీరోయిన్ మొదలు లేడీ క్యారెక్టర్స్‌కి కాస్ట్యూమ్ డిజైన్ చేసే బాధ్యతను సంయుక్తకు అప్పగిం చేవాడు. ఆ పనిని పర్‌ఫెక్ట్‌గా చేసి 'శభాష్' అనిపించుకునేది ఆమె. నాటి ముచ్చట్లను ఇలా తన మనసు వాకిట్లోకి తెచ్చుకుంది సంయుక్త.

అప్పుడంతా స్వర్ణయుగం. సినిమా గురించి నాకేమీ తెలియదని నన్ను ఏనాడూ చులకన చేయలేదు. నా సలహాలను గౌరవించేవారు. కార్తీకదీపం చేస్తున్నప్పటి విషయం. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి కోడలు నాకు మంచి ఫ్రెండ్. ఒకసారి నన్ను ఆయనకు పరిచయం చేసింది. మామయ్యా... రెడ్డిగారి మిసెస్.. అని అప్పటికే ఆయనకు గొంతు క్యాన్సర్‌తో మాటపోయింది. తను చెప్పాలనుకున్న దాన్ని కాగితం మీద రాసి చూపించేవారు. నన్ను పరిచయం చేయగానే ఆయన వీలైతే మీ సినిమాలో నన్ను ఒకసారి ఉపయోగించుకోండి" అని రాశారు. ఆ విషయాన్నే మా వారితో చెప్పాను. సరే అన్నారు. కృష్ణశాస్త్రి గారి వాళ్లింటికి వెళ్లి పాట రాయమని అడిగారు. పాట సన్నివేశాన్ని రాసి పంపమన్నారు. పంపారు. ఆయన పాట రాశారు. అయితే పాట నిడివి మూడు నిమిషాలుంటే కృష్ణశాస్త్రి పాట పదాల నిడివి నాల్గు నిమిషాలకు వచ్చింది. అంటే లెంగ్త్ ఎక్కువైన ఆ ఒక నిమిషానికి అప్పట్లో గాయకులు ఒక పూట కాల్షీట్‌కు చార్జ్ తీసుకునేవారు. కాబట్టి శాస్త్రిగారి దగ్గరకు వెళ్లి విషయం చెప్పి ఒక నిమిషం పదాలను కట్ చేయమన్నారు. కుదరదని కరాఖండిగా చెప్పారు శాస్త్రి. సరే అని ఒక పూట ఎక్స్‌ట్రా కాల్షీట్ చార్జ్‌తోనే పాటను రికార్డ్ చేశారు. అదే "ఆరనీకుమా ఈ దీపం కార్తీకదీపం' సూపర్ డూపర్ హిట్ సాంగ్! ఒక కవి హృదయాన్ని ఆయన ఎంతలా అర్థం చేసుకుంటారో తెలుపడానికి ఈ సంఘటన చెప్పాను. ఇండస్ట్రీ చెన్నైలో ఉన్నప్పుడు ఆయన సినిమా రిలీజ్ అయిన రోజు ఫ్లైట్ టికెట్ కొని నన్ను పిల్లల్ని హైదరాబాద్ పంపించేవారు. ఇక్కడి థియేటర్లలో అన్ని షోస్ చూసి రాత్రికి తిరిగి చెన్నై వెళ్లే వాళ్లం. పబ్లిక్ ఏమనుకుంటున్నారో చెప్పేవాళ్ళం. దాన్ని బట్టి సినిమా హిట్టా? కాదా? అన్న అంచనాకు వచ్చేవారు ఆయన. ఇద్దరం కల్సి బయట సినిమాలకు వెళ్లేవాళ్ళం.

**పిల్లలంటే బాగా ఇష్టం...**

నలుగురూ ఆడపిల్లలైనా ఎప్పుడూ బాధపడలేదు ఆయన. కాకపోతే చాలా ప్రొటెక్టివ్‌గా ఉండేవారు. షూటింగ్ కోసం నెల రోజులు అవుట్ డోర్లో ఉన్నా రోజూ రాత్రి పన్నెం డింటికి ఫోన్ చేసేవారు. అప్పుడంతా ట్రంక్ కాల్సే. తను ఉన్నచోట అసౌకర్యం లేకపోతే ఓ మైలు నడిచి వెళ్లి మరీ మాకు ఫోన్ చేసేవారు. ఎవరో తెలియకుండా తలుపు తీయొ ద్దని చెప్పేవారు. అలాగని పిల్లల అభీష్టానికి తనెప్పుడు వ్యతిరేకంగా లేరు. వాళ్ల చదువుల దగ్గర నుంచి పెళ్లిళ్ల దాకా ప్రతిదాంట్లో వాళ్ల అభిప్రాయానికే విలువిచ్చారు. పిల్లలు వాళ్లకేం తెల్సని వాళ్లను అడుగుతు న్నారని నేను విసుక్కుంటే నన్నే కోప్పడేవారు. 'వాళ్ల చదువు, వాళ్ల వ్యక్తిగత విషయాల్లో వాళ్ల ఇష్టానికే నా ప్రాధాన్యం. దీంట్లో నువ్ జోక్యం చేసుకున్నా నేను సహించను' అని చెప్పేవారు. మనవలు, మనవరాళ్ళం టే కూడా అంతే ప్రాణం పెట్టేవారు.

**చివరకు...**

ఆయనెప్పుడూ తన గురించి ఆలోచించుకోలేదు. ఆయన దృష్టి డబ్బు సంపాదన మీద ఎప్పుడూ లేదు. అవసరాలు తీరేంత డబ్బుంటే చాలు అనుకునేవారు. అయితే హైదరాబాద్ వచ్చాకే డబ్బు ఎంత అవసరమో ఆయనకు తెలిసింది. చనిపోయే రెండు నెలల ముందే అన్నారు. "డబ్బు పోగు చేయాలి.. నీకోసం ఏదో ఒకటి చేయాలి' అని. ఆయన ఉన్నప్పుడే నాకు జీవితం. ఆయన లేని నేను శూన్యమే! పిల్లల కోసం బతకడం తప్ప ఇప్పుడు నా జీవితానికి అర్థమే లేదు" అంటూ ఆనాటి జ్ఞాపకాలకు చెమ్మగిల్లిన కళ్లతో ముగింపు పలికింది సంయుక్త.

**ఆయన కూతుళ్లుగా గర్వపడుతున్నాం...**

శైలజ (డ్రెస్ డిజైనర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్) నాకు రాయడమంటే ఇష్టం. ప్రియదర్శిని యాడ్ ఏజన్సీలో పనిచేస్తున్నప్పుడు దాని తరపున డిటెక్టివ్ పరమహంస అనే టెలీ సీరియల్‌కు స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశాను. అప్పుడే లగడపాటి శ్రీధర్ వాళ్ల సంస్థలో పనిచేసే అవకాశం వచ్చింది. అలా సినిమాలతో మళ్లీ అనుబంధం ఏర్పడింది.

నిజానికి ఇంట్లో సినిమా వాతావరణమే ఉన్నా అంతకు ముందు డైరెక్ట్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఎప్పుడూ లేదు. నేను స్టోరీ న్యారేట్ చేస్తుంటే అబ్బ...అచ్చు ప్రభాకర్ రెడ్డిని చూస్తున్నట్లే అనిపిస్తుంది అనేవాళ్లు. ఆ గుర్తింపు చాలు అనిపించేది. ఎక్కడికి వెళ్లినా ప్రభాకర్ రెడ్డి పిల్లలా... అని రెస్పెక్ట్ ఇస్తారు. అంతకన్నా... ఏం కావాలి? నాలుగేళ్లు సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా కూడా చేశాను. ఈ రోజు మేము ఏం చేసినా.. ఈ స్థితిలో అంతా నాన్న చలవే ఆయన ప్రభావం మా మీద చాలా ఉంది. మేము ఏ అడుగు వేయాలన్నా నాన్నే గుర్తుకొస్తాడు. ఆయన ఆశయాలు గుర్తుకొస్తాయి. మేం ఏం చేస్తే ఇష్టపడతాడు. ఏం చేస్తే బాధపడతాడో అన్న ఆలోచన వస్తుంది. అందుకే అనుకుంటాం... ఆయన మా మధ్య లేకపోయినా మమ్మల్ని నడిపిస్తున్నాడు అని. నిజానికి ఆయన పోవడంతో మా ఫ్యామిలీ ఓ గొప్ప అండను కోల్పోయింది. ఆయన ఉన్నప్పుడు నాన్న వాళ్ల అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు అందరం కలిసే




ఉండేవాళ్లం. కానీ నాన్న పోవడంతో మా కుటుంబం ఏకాకి అయింది. అయినా ఆయన మాతో గడిపిన కాలం, ఆయన వదిలిన జ్ఞాపకాలు... ఇవే మమ్మల్ని నడిపిస్తున్నాయ్... ఇప్పుడు పిల్లలుగా మేము అనుకునేది ఒకటే. మాకు చేతనైనంతలో ఆయన ఆశయాలను నెరవేర్చాలని.

**లక్ష్మి (గృహిణి)...**

నాన్న తనకోసం ఎప్పుడూ ఆలోచించుకోలేదు. ఆయన సాయం కోసం వచ్చిన మనిషిని ఖాళీగా పంపించలేదు. "నాన్న – నువ్వు అందరినీ నమ్మేస్తావ్".. వాడు పెద్ద ఫ్రాడ్‌లా ఉన్నాడు నువ్వేమో నమ్మి హెల్ప్ చేశావ్" అని మేమంటే "అలా నమ్మకం లేక సహాయాన్ని ఆపితే నిజంగా అవసరమున్నవాళ్లు సాయం అందక జీవితాన్నే కోల్పోయే ప్రమాదం ఉందమ్మా" అనేవాడు. ఆ మాటలు మాకిప్పటికీ గుర్తొస్తాయ్. నాన్న మొదలు పెట్టిన ట్విన్‌సిటీస్ ఆర్గనైజేషన్ నిరుపయోగంగా మారుతుంటే దాన్ని బతికించుకోవడానికి డి.కె.అరుణ దగ్గర్నుంచి.. నేను రిక్వెస్ట్ చేయని నేతల్లేరు. అయినా రెండేళ్ల కిందట మూత పడింది. సహాయం అందించి దాని గురించి చెప్పుకోవడం తప్పేమో కానీ... నాన్న ఉన్నప్పుడు కళకళలాడిన యూనియన్లు, అసోసియేషన్లు... ఇప్పుడు...వాటి గురించి మాట్లాడ్డం కూడా అనవసరం. ఎంతో మందికి లైఫ్ ఇచ్చాడు ఆయన. జయప్రద, జయసుధ లాంటి హీరోయిన్లకు పేరు పెట్టింది ఆయనే. సినిమా ఇండస్ట్రీలో అటు కార్మికులకు, ఇటు ఆర్టిస్టులకు అందరికీ కావల్సినవాడులా ఉన్నాడు. కానీ ఈ రోజు ఎంతమందికి ఆయన గుర్తున్నాడు? నాన్న ఓ లెజెండ్ ఇప్పటికీ మమ్మల్ని నడిపిస్తున్న ఓ శక్తి.

**డాక్టర్ విశాలాక్షి (డెంటల్ సర్జన్)**

నాన్న మమ్మల్నెప్పుడూ ఏ విషయంలో ఫోర్స్ చేయలేదు. కానీ ఏం చేసినా పర్‌ఫెక్టుగా చేయాలని చెప్పేవాడు. ఆయనది చాలా దూరదృష్టి. ఆయన చెప్పిన ప్రతి మాట పదిహేనేళ్లకైనా కరెక్ట్‌గా ఉంటుంది. నాన్న మా మధ్య లేకపోయినా ఆయన ఇన్‌ఫ్లూయెన్స్ మమ్మల్ని గైడ్ చేస్తుంది. (ప్రభాకర్ రెడ్డి వైద్య వృత్తిని వారసత్వంగా ఈమె నిలబెడుతోంది) నాన్న మాకు కోట్ల డబ్బులు మూటకట్టి ఇవ్వలేదు. కానీ అంతకంటే విలువైన జీవనశైలిని వారసత్వంగా ఇచ్చాడు. ఆయన కీర్తి ప్రతిష్టలను పంచుకొమ్మన్ని చెప్పాడు. ఇంతకన్నా ఏం కావాలి. ఏ తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వలేని అమూల్య కానుకను మాకు ఇచ్చారు. నిజంగా ఆయన బిడ్డలుగా మేమెంతో గర్వంగా బతుకుతున్నాం ఈ జీవితానికి ఇది చాలు అని ముక్త కంఠంతో ముగించారు ముగ్గురు.

**ముక్తాయింపు...**

ప్రభాకర్ రెడ్డి నటుడు, నిర్మాత, దర్శకుడు, రచయితగానే కాదు. రాజకీయాల్లో కూడా విజయవంతమే. అద్భుతమైన ఇంగ్లీష్ ఆయన అదనపు అర్హత. రాజీవ్‌గాంధీతో అనర్గళంగా ఇంగ్లీషులో సంభాషించగల ఒకే ఒక నటుడు కమ్ రాజకీయనేత ప్రభాకర్ రెడ్డి. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రాణప్రదాత! తెలంగాణ మట్టిలో మాణిక్యం.

## ఆధార గ్రంథాలు


1. వెండి తెర వైభవం- ఆకురాతి శేషాచలం
2. మెరుపుల అలలు-డాక్టర్ కొండల్ రెడ్డి మండల్ రెడ్డి
3. ఎన్ వి రామారావు గారి వ్యాసం
4. హెచ్ రమేష్ బాబు గారి వ్యాసం




-డా॥రావి రంగారావు 9247581825

అంశం: తొలకరి

పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.

2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 23 కు మొత్తం 23మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 7 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-సంపాదకులు

# వచన కవితలు

### తొలకరి

వచ్చింది వచ్చింది తొలకరి
వేడెక్కిన గిరులకి ఆ విరులిస్తూ...
చినుకు నెలా చిమ్ముతుందో
ఆహా! విరిసి కురిసిన అందాలతో!.
బస్సుబుస్సుమని భూమి పొంగి
పురి విప్పెను నెమలి నాట్యమై
పరవశించెను కోయిల గానమై
ఆహా! చల్లదనమే జగతి నిండుగా!.
కారు మేఘాల హంస పయనమై
జిగేలు మన్న మెరుపులతో
ధనేల్ మన్న పిడుగులతో
ఆహా!
అబ్బురపరిచెను ఇహ లోకం!.
పొలములోన విత్తనము
చిరునవ్వై మొలకెత్తగా
సంతసించి రైతన్న
ఆహా! ఆనందపు చిందు లేసే...
హరివిల్లు కాంతితో
వాన గీతం ఆలపిస్తే
సిగ్గుతో పరిగెత్తెను
ఆహా! సెలయేరు మువ్వన్నెలు!.
లోకాలకు శుభకరమై
భూమాతయే లేచి వచ్చి
పచ్చ చీర కట్టుకొని,
ఆహా! అలరించెను
ఆబాలగోపాలమును!
మట్టి వాసన సుగంధాలతో
మరువజాలని సోయగాలతో
జగ మంతా తడిపేస్తే
ఆహా! ఆనందపు కేరింతలే...

-సత్యవతి

ఒకే కక్ష్య లో పరిభ్రమణం చేస్తూ
ఒంటరి గమనం లో అలసి పోయిన భూదేవి,
సూర్యనారాయణుని పలకరింపు కోసం
ఆయనకు ఒకింత దగ్గరగా జరుగగా
ఆయన ముఖంలో విప్పారిన ఆనందం వలన
కిరణాల తీక్షణత
'పెరిగి' మండు వేసవిగా మారింది.
కొన్ని డిగ్రీలు పక్కకు జరిగినందుకే భూతలంపై
పుట్టిన విపరీతమైన ,గ్రీష్మపు తాకిడికి
జీవరాశులు గగ్గోలెత్తగా..
తల్లి మనసుతో భూమాత,
వాటి తాపాన్ని చల్లార్చడం కోసం
సముద్ర మేఘాలతో
తొలకరి ని కురిపించింది?
ఆమె అభ్యర్థనపై సకల జీవ కోటికి
తండ్రి అయిన దినకరుడు కూడా
శాంతించాడు.
వారిద్దరి పరిరక్షణలో సుందర మనోహరం గా
వెలుగులీనుతున్న ప్రకృతి కాంత
చిట పట చినుకుల చల్లదనంలో సేద దేరింది.
తొలకరికి తడిసిన ఆమె మేను
పులకించి పోయింది.
పక్షులు నాట్యం చేశాయి
వృక్షాలు చిగురించాయి.
రైతులు భూమిలో నాటిన విత్తనాలు
'జీవం' పోసుకుని 'దరహాసపు'
మొలకల తో కేరింతలు కొట్టాయి.
తొలకరి చినుకుల పరిష్వంగంలో
దాహార్తిని తీర్చుకుందిజీవకోటి.
ఒక పెద్ద యుద్ధం తరువాత కుదిరిన
'శాంతి' ఒప్పందం లా ..
ఒక తీక్షణ గ్రీష్మ పరితాపము పిదప కురిసిన
'తొలకరి' చినుకు
ప్రకృతికి ఆనందాన్ని కలిగించింది.

– శ్రీనివాస శాస్త్రి

### తొలకరి

ఉషోదయ వేళ మెరిసే
తొలి కిరణంలా..
సాయం సంధ్య వీచే
చల్లని గాలిలా..
బ్రాహ్మీ ముహూర్తాన వచ్చే
అందమైన కలలా..
వెన్నెల్లో వికసించిన
మల్లెల పరిమళంలా..
సప్త వర్ణాలను నింపుకున్న
ఇంద్రధనస్సులా..
సప్త స్వరాలు పలికించే
మురళీ గానంలా..
మంచు తెరలో దాగిన
హిమ బిందువులా..
తొలకరి వచ్చింది
ధరిత్రి పులకించింది
ప్రకృతి పరవశించింది
రైతన్నకళ్లల్లో ఆనందం నింపింది!

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

### తొలకరి

కొండగాలి తగులగ కరిమబ్బులు వెదజల్లగా
తొలకరిచినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
వేడుకొనుచు తరువులే వేడిగ నిట్టూర్చగా
హరితపు నవ్వులు వాటికి హాయిగ అందించగా
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
అల పాటల కోయిలలే సెలవనుచును వెళ్ళగా
సరి నెమళులు నాట్యముతో స్వాగతమే పలుకగా.
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
పచ్చికతోటి తివాచీలు అచ్చముగానే నేయగా
మట్టి సుగంధపు వాసన మరి గాలులలో నింపగా
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
జ్వరపీడిత ప్రకృతికీ ఔషధమే తామవగా
తీపిమందు గుళికలనే తీరుగ అందించగా
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
వేడిని వేటాడంగా హరివిల్లే విరియగా
నీటిబాణములనెన్నో నీటుగ అందీయగా
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా.
పుడమి పొరలో బీజములే పురుడును పోసుకొనగా
పచ్చని సంసారము పుడమిని బాగుగ విలసిల్లగా
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
చిటపట చినుకుల తాళం చిరుబాలలు మెచ్చగా
వరుసగ వానావానా వల్లప్పని గెంతగా
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా.
కర్తవ్యమును గుర్తుజేసి కర్షకులనె కదలించగ
జగతి చల్లగుండాలని చల్లగ చినుకులనే అక్షతలుగ
తొలకరి చినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా
కొండగాలి తగులగ కరిమబ్బులు వెదజల్లగా
తొలకరిచినుకులు చల్లగ ఇల కురిసెను జల్లుగా

-గోలి హనుమచ్ఛాస్త్రి.

### తొలకరి

రావమ్మా!...'తొలకరి' వానమ్మా!!
నిండు వేసవి 'మండుటెండ'లు...
మిగిల్చిన 'గ్రీష్మ' తాపానికి...
'నెర్రెలు'వారిన పుడమితల్లి 'గుండె పగుళ్ళ'ను...
'ప్రేమ'మీర స్పృశిస్తూ...
మంచు ముత్యాల జల్లుల్ని కురిపిస్తూ...
నింగినొదిలి 'నేల'కు జాలువారే...
ఓ 'తొలకరి' వానమ్మా...!
త్వరగా రావమ్మా...!!.
నువ్వొస్తావనే కాబోలు...
'నేలతల్లి' నిలువెల్లా కళ్ళుచేసుకునీ...
ఎదురు చూస్తోంది...!
నిదుర కాస్తోంది...!
'పువ్వు' విరబూస్తోంది...!
'పిట్ట' కూనిరాగం తీస్తోంది...!!
త్వర త్వరగా రావమ్మా...!
మా 'తొలకరి' వానమ్మా...!!.
మండే గుండె 'గాయా'లకు...
ప్రకృతి పూసే చల్లని 'లేపన'మై...
బాధల గాధల్ని మరపించే బ్రతుకు 'సంజీవని'వై...
నువ్వొస్తున్నావనీ...
చిరుగాలి చెవిలో చెప్పిందిలే...!
నీ 'రాక' కబురు విప్పిందిలే...!!
రావమ్మా 'తొలకరీ'...!
మా పాలిట 'క్షేమంకరీ'...!.
నువ్వొస్తున్నావన్న ఆనందంలో...
'అన్నం, నీళ్ళూ' మరచీ...
'నాగలి' భుజానికెత్తుకునీ...
'అన్నదాత' పొలం బాట పట్టాడు!
నీళ్ళు నిండిన కళ్ళతో...
నింగివంక ఆశగా చూస్తున్నాడు!
'ఆత్మ నివేదన' చేస్తున్నాడు!!
'స్వేదం' చిందించి 'సేద్యం' చేయాలంటే...
'పంటి' క్రింద 'కూడు' చేరాలంటే...
నీవు రావాలి సుమా...!
నీ 'కరుణ' కావాలి మాకు..!!
'చినుకు' చలువన... 'మొలక'నై పుట్టీ...
పుడమితల్లి ఒడిలో 'పసిపాప'నై ఊయలూగాలని...
'విత్తనం' ఆరాట పడుతోంది చూడు...!
'చినుకు' పెట్టే 'ప్రాణభిక్ష'తో ...
'మోడు'వారిన కొమ్మ మళ్ళీ...
చిగురులు తొడగాలనుకుంటోంది...!
కొమ్మ మాటున 'కోయిలమ్మ'...
తన గొంతు సవరించుకునీ...
రారమ్మని నిను పిలుస్తోంది!!
'వాగు'వంకలు పొంగీ...
'పంట'చేలను తడిపీ...
'పైరుపచ్చ'ల పసిడి సొగసులతో...
ధరణి ఎదనలంకరించాలని...
'కల'లుగంటున్నాయి...!
కలవరిస్తున్నాయి...!!
రావమ్మా!...'తొలకరి' వానమ్మా!!
'అన్నదాత' కంట ఆనందాల 'పంట'వై...!
ఆదుకుని ఓదార్చే వరాల 'పెన్నిధి'వై...
చినుకు చినుకులో తళుకులీనుతూ...
నైఋతి 'ఋతు'రాగానివై...!
మనిషి బ్రతుకున 'అంతర్భాగా'నివై...!!

-రాయపురెడ్డి సత్యనారాయణ

### తొలకరి

సూర్యుడు సాగరుల
స్నేహ ఫలాలు వర్షధారలై
భూమి కడుపు పండి
ప్రజల కడుపు నిండ
అరుదెంచిన తొలకరి.
చినుకు చినుకు ఏకమై
ఏరులై పారుతుండ
ఏరువాక సాగరోయంటు
ఎలుగెత్తి పాడుతుండ
ఏతెంచిన తొలకరి.
మట్టి మాటు విత్తులన్ని
వళ్ళు విరుచుకుంటు లేచి
పచ్చదనపు కోకకట్ట
పశుపక్ష్యాదులు పరవశించ
పులకింతల తొలకరి.
హరివిల్లులో వర్ణాలు
సౌరభాల విరిమాలలై
పుడమితల్లి కంఠ సీమను
రమణీయమై అలరించగ
సుందరమై తొలకరి.
పడగవిప్పి నాగులు
పురివిప్పి మయూరాలు
తూనీగల విహారాలు
చిన్నారుల కేరింతల
నయనానందకర తొలకరి.
తళుకులీను తారకలను
వెండివెన్నెల జాబిలమ్మను
కారుమబ్బులు కమ్ముకుంటు
చల్లగాలులు రివ్వుమంటు
మట్టి వాసన గుప్పుమంటు
ఆబాలగోపాలాన్ని అలరించ
అరుదెంచిన తొలకరి

-సంబరాజు రమణి

### తొలకరి పలకరించే వేళ

చినుకులు
నేలను ముద్దాడాయి
పుడమి తల్లి పులకించిపోయింది
ఆ....ఆత్మీయ స్పర్శతో
రైతు కళ్ళల్లో
కొత్త ఆశలు చిగురించాయి
నేలతల్లి పొత్తిళ్లలో
విత్తులు నాటడంతో.
మనసు మయూరమై
పురివిప్పి నాట్యమాడింది
మట్టి పరిమళాలను
మోసుకొచ్చిన గాలిని తాకడంతో.
ఏరువాక ఏకమై
నదులు పరవళ్ళు తొక్కాయి
తొలకరి పలకరించే వేళ
సెలయేటి సంగీత స్వరాలతో
చిన్నారులు తూనీగలైనారు
పచ్చదనాల ప్రకృతి ఒడిలో
ఎటు చూసినా పరవశమే
ఆనందాల తొలకరి తడి కి

– జాగరపు శంకరరావు

## గుదిబండి వెంకటరెడ్డి చిరస్మరణీయుడు




గుదిబండి వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న ఓలేటి పార్వతీశం, డా॥చింతలపూడిత్రినాథరావు తదితరులు.

గుదిబండి వెంకటరెడ్డి చిరస్మరణీయుడని ప్రముఖ సాహితీవేత్త డా॥ వోలేటి పార్వతీశం అన్నారు. శ్యామగాయత్రి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో జీవీఆర్ ఆరాధన అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వోలేటి పార్వతీశం మాట్లాడుతూ వెంకటరెడ్డిని సాంస్కృతిక భీష్ముడుగా అభివర్ణించారు. సభాధ్యక్షత వహించిన ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం డా॥చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ సాంస్కృతికరంగానికి వెంకటరెడ్డి అందించిన సేవలు అనన్య సామాన్యమని అన్నారు. సభలో శ్యామగాయత్రి సంస్థ అధ్యక్షురాలు చిల్లా శివపార్వతి, రేణుకాప్రభాకర్, వెంకట్రావు పాల్గొన్నారు. సభకు ముందు కళ్యాణ్, రాధారాణి, రఘు, భరణి, శ్రీనివాసమూర్తి, అర్జున్, మహేశ్ తదితర గాయనీగాయకులు గుదిబండి వెంకటరెడ్డికి స్వరనివాళి అర్పించారు.

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

### నాలుగు మాటలు

అడుగు అడుగునీ వేసుకు పోకలా
అందులో పడిన ముద్రలు చూడు..
"నీవెంటే నేనను"మౌన రుజువులవి.
తప్పేదో జరిగినట్టుగా తలదించి ఉండిపోకలా
ఇరు"కన్నులు పలకరించె"లా తలఎత్తి చూడు
కలలన్ని కవితలయ్యి నిను చేరే క్షణాలవి.
కాలాలూ తెలివంటు నను చూసీ నవ్విపోకలా
యదతలుపులు మనసారాఓసారి తెరిచి చూడు
ప్రతి మదిలో పుట్టే చెలి "చలి పులకింత"లవి.
సరసం తెలియని మోడు అని ఈసడించకలా
నీ స్వచ్ఛ ప్రేమ సువాసన చూడు
నా ఆశల "మల్లెల మాసపు"గంధములవి.

-నరసింహ
91001 80580

### త్రాగబోకు సోదరా

త్రాగబోకు సోదరా
పాడుగాకు సోదరా
మద్యం లో మానవుడు
మరి మరీ చితుకుతాడు
మురార్జీ మాట వినరా
బ్రతుకుమంచిబాట కదరా.
ఇల్లు ఇల్లాలు నీకోసం చూసేరా
ఇల్లే స్వర్గం రా ఇల్లాలే దేవతరా
ఇంటి పెద్దవి నీవు రా
మద్యంతో తైతక్కలాడకురా.
సమాజంలో నీవు
మంచిగా మసులుకో
నీ మంచితనం పెంచుకో
భవిష్యత్ తరాల వారికి బాట చూపరా.
ఆడది అంటే ఆట బొమ్మ కాదురా
అన్ని అందించి ఆదిదేవతరా
ఆలు బిడ్డలను
అగచాట్లు చేయకురా
దాంపత్య జీవితంతో
దర్జాగా బతకరా
కళ్ళు తెరిస్తే జననం
కళ్ళు మూస్తే మరణం
నీ జన్మకు సార్థకత చేకూర్చారా
పలువురు నీ మరణం తరువాత
పొగడాలి రా.
ఏముందిరా హల్కు హల్లో
కడుపు నిండుతుందా
పరువు పోతుంది కదరా
ప్రాణం పోతుంది కదరా
త్రాగబోకు సోదరా
పాడుగాకు సోదరా

-బొమ్మిడి వినోద్ రెడ్డి, శ్రీరామగిరి

### వర్షం

వర్షం కర్షక హర్షం
పుడమి పునీతం
నేలకు నేస్తం, ప్రీత్యం
మోతాదున మోదం
మితిమీరిన ఖేదం
సకాలం సఖ్యం
అకాలం దుఃఖం
వృక్ష జాలానికి ఉపవీతం
జంతుజాలానికి జవసత్వం
మానవులకు మోదం
చెరువులు, చెలిమలకు చేరువ
నదులకు నాట్యం
సముద్రుడికి సంబరం
వెరసి ప్రకృతికి పరవశం

– రాజేంద్ర ప్రసాద్ ఎరబాటి
97050 84693

### వయస్సు-మనస్సు

చితిపై చేరి
కాలంతో పోటీ పడుతూ వయసు
ప్రాయపు బుగ్గల్లో నిగ్గు తేలుతుంటే
ఊహలకందని తలపులతో మనసు
సీతాకోకచిలుకై చిత్రంగా ఎగురుతుంది.
ఏ వర్ణమైనా సువర్ణమే అనుకునే మది
కలలకు కాళ్ళను జతచేసి తిరుగుతుంది
గుచ్చుకుంటున్నవి ముళ్లని ఎరుగలేదు
రక్తం కారుతున్నా తెలుసుకోలేనితనమే తనది.
గువ్వల జంటల కువకువలకు మురుస్తూ
కోకిలమ్మ కుహుకుహూలకు పరవశిస్తుంది
నెమలమ్మ నాట్యంలోని లయ తానై
హృదయాకాశంలో గంతులు వేస్తుంది.
ఎక్స్ రే చూపుల్లో చిక్కుకున్న వలపుగాలి
వడగాలై వాడ్చేస్తుంటే సోలిపోయి మూగవుతుంది
శూన్యాన్ని ఆవాసంగా చేసుకుని తనకు తానే
పేర్చుకున్న చితిపై చేరి మృతమౌతుంది మనసు!!

-సుజాత తిమ్మన. హైదరాబాదు.

### ఆ ప్రాణాలు

తినడానికి తిండి లేకుండే సమయాలు,
ప్రతి రోజు తో యుద్ధం చేసిన రోజులు,
ఎన్నో సమస్యలు వచ్చి మీద పడిన,
గుండెలోతుల్లో బాధను దిగమింగుకుని,
నా అనుకునే వారి కోసం ప్రయాణం,
కంటి నిండా నిద్ర పోనీ క్షణాలు,
ఆలోచించి ఆలోచించి బాధతో బరువైన జీవితాలు,
అందరిని చూసి మనస్సు నింపుకున్నా,
బ్రతుకులు మారడానికి జీవితాలు
ఓ దారిన పడడానికి,
నలుగురిలో తేలెత్తి చూడడానికి,
జీవితాన్ని చక్కబెట్టుకోవడానికి,
వలసలు జీవితంలో ఆశలు రేపాయి,
అందరికి దూరంగా ఉన్నా ఏదో ధైర్యానిచ్చింది,
చిమ్మ చీకట్ల జీవితాల్లో వెలుగు నింపింది,
బ్రతుకు మీద ఆశలు రేపి భవిష్యత్తుకు ఆయువు పోసింది.

-నారి నరేష్, 968 9302 9220

